డాక్యుమెంట్ల డిజిటలైజేషన్

అసంపూర్ణం



నల్లగొండలో దస్తావేజులు ఇలా..

స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖలో పాత డాక్యుమెంట్ల పరిస్థితి దయనీయంగా మారింది. ప్రభుత్వానికి కోట్ల రూపాయల ఆదాయాన్ని ఇస్తున్నా రిజిస్ట్రేషన్ల శాఖకు ఉమ్మడి జిల్లాలో సొంత భవనాలు లేవు. కనీస వసతులు లేని అద్దె భవనాల్లో డాక్యుమెంట్లు ఉంచడంతో వర్షం వస్తే తడుసున్నాయి. డాక్యుమెంట్ల డిజిటలైజేషన్ నేటికీ పూర్తికాలేదు.

- (ఆంధ్రజ్యోతి,నల్లగొండ)

» 60ఏళ్లు పైబడిన దస్తావేజులకు భద్రత కరువు » కోట్ల రూపాయల విలువైన ఆస్తుల పత్రాలపై నిర్లక్ష్యం » ఆన్‌లైన్‌లో కనిపించిన పాత డాక్యుమెంట్లు

జిల్లా కేంద్రంలోని రిజిస్ట్రేషన్ కార్యాలయంలో కోట్లాది రూపాయల విలువైన ఆస్తుల క్రయ విక్రయాలకు సంబంధించిన దస్తావేజులు 60ఏళ్లకు పైబడినవి స్టోర్ రూమ్‌లో రక్షణలేక మూలుగుతున్నాయి. జిల్లాలోని పలు కార్యాలయాల్లో సైతం ఇదే పరిస్థితి నెలకొంది. నకిరేకల్, మోత్కూరు, కోదాడ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు ఉమ్మడి రాష్ట్రంలో ప్రభుత్వం సొంత భవనాలు నిర్మించగా, తెలంగాణ ఏర్పాటు అనంతరం ప్రభుత్వం ఆ భవనాలను ప్రారంభించింది. ఆ తరువాత రిజిస్ట్రేషన్ల శాఖకు గత ప్రభుత్వ హయాంలో ఒక్క భవనం కూడా నిర్మించకపోగా, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఈ రెండేళ్లలోనూ భవన నిర్మాణాలు చేపట్టలేదు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 15 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉండగా, మూడు కార్యాలయాలకు మాత్రమే సొంత భవనాలు ఉన్నాయి. మిగతా 12 సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలు అద్దె భవనాల్లోనే అరకొర వసతుల నడుమ కొనసాగుతున్నాయి. కనీసం సిబ్బందికి, ఆస్తుల క్రయవిక్రయదారులకు కూడా మౌలిక ఇక్కడ వసతులు కరువయ్యాయి. 60ఏళ్లకు పైగా పాత డాక్యుమెంట్లలో ఉర్దూ, ఇంగ్లీష్ ఉన్నవి అనేకం ఉన్నాయి. వాటికి భద్రత కరువైంది. ఆయా భాషలకు అనుగుణంగా నిష్ణాతులైన వారి ద్వారా డాక్యుమెంట్లను ఆన్‌లైన్‌లో పొందుపర్చాల్సి ఉండగా, శాఖ అధికారులు ఆవైపుగా దృష్టి సారించకపోవడంతో గతంలో జరిగిన డిజటలైజేషన్ డాక్యుమెంట్లపై అపోహలు నెలకొన్నాయి.

నిర్లక్ష్యంతోనే దెబ్బతింటున్న డాక్యుమెంట్లు...

రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతి ఆర్థిక సంవత్సరంలో ఉమ్మడి నల్లగొండ జిల్లా నుంచి స్టాంపులు, రిజిస్ట్రేషన్‌శాఖ ద్వారా రూ.300కోట్ల నుంచి రూ.350కోట్ల వరకు ఆదాయం సమకూరుతోంది. అయినా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఏ మాత్రం వసతులు లేక ప్రతీ రోజు కార్యాలయానికి వచ్చే ఆస్తుల క్రయవిక్రయదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వారితోపాటు అధికారులు, ఉద్యోగులు సైతం ఇబ్బందులుపడుతన్నారు. జిల్లా కేంద్రంలో మునిసిపల్ కాంప్లెక్స్‌లో కొనసాగుతున్న డీఆర్ కార్యాలయం పక్కనే నల్లగొండ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం సైతం అద్దె భవనంలోనే కొనసాగుతోంది. ఈ రెండు కార్యాలయాల పక్కనే ఉన్న శిథిలావస్థలో ఉన్న స్టోర్‌రూమ్‌లో విలువైన డాక్యుమెంట్లు నిల్వచేశారు. వాటిని పరిరక్షించేందుకు అధికారులు ఏ మాత్రం చర్యలు తీసుకోవడం లేదు. స్టోర్‌రూమ్‌లో అవగాహన ఉన్న ఉద్యోగిని, వాచ్‌మెన్‌ను సైతం నియమించాల్సి ఉంది. స్టోర్‌రూం కాంప్లెక్స్ పెద్దగా లేకపోవడం, ప్రహరీ లేకపోవడం, స్టోర్‌రూంకు ఎలాంటి రక్షణ లేకపోవడంతో డాక్యుమెంట్లకు భద్రత కరువైంది. మునిసిపల్ కాంప్లెక్స్ ఇప్పటికే శిథిలావస్థకు చేరగా, అదే కాంప్లెక్స్‌లో స్టాంపులు, రిజిస్ట్రేషన్‌శాఖ కార్యాలయాలు కొనసాగుతున్నాయి.

డిజిటలైజేషన్ కొంతే...

గత ప్రభుత్వ హయాంలో పాత డాక్యుమెంట్ల డిజిటలైజేషన్ ప్రారంభించగా...

మిగతా 8వ పేజీలో..

ఎరువు.. బరువు

» మళ్లీ పెరిగిన ధరలు » భారంకానున్న సాగు
» డీఏపీ, యూరియా మినహా అన్ని ఎరువుల ధరల పెంపు
» బస్తాకు రూ.50 నుంచి రూ.100 పెరుగుదల
» ఉమ్మడి జిల్లా రైతులపై రూ.20కోట్ల అదనపు భారం



(ఆంధ్రజ్యోతి,మోత్కూరు)

కేంద్ర ప్రభుత్వం ఏడాదికోసారి పంటల మద్దతు ధర పెంచుతుండగా, ఎరువుల కంపెనీలు ప్రతీ సీజన్‌కు (ఏడాదికి రెండు సార్లు) ఎరువుల ధర పెంచుతున్నాయి. వానాకాలం పంటకు ముందు జూలైలో ఎరువులపై రూ.50 నుంచి రూ.330 వరకు ధర పెరగ్గా, ఈ యాసంగి నుంచి ఎరువుల బస్తాకు రూ.50 నుంచి రూ.100 వరకు ధరలు పెరిగాయి.

రూ.100 వరకు పెరిగిన కాంప్లెక్స్ ఎరువులు

ఎరువుల కంపెనీలు డీఏపీ, యూరియా మినహా మిగతా అన్ని రకాల కాంప్లెక్స్ ఎరువుల ధరలు పెంచాయి. రోజు రోజుకూ పెరుగుతున్న కూలి రేట్లు, యంత్ర పరికరాల ధరలకు తోడు ఎరువుల ధర పెరగడంతో రైతులు వ్యవసాయం చేయకపోవడమే మేలనే ఆలోచనకు వస్తున్నారు. అంతర్జాతీయ మార్కెట్లో ముడి సరుకుల ధరలు పెరిగినందున తయారీ ఖర్చులు పెరిగి గిట్టుబాటు కావడంలేదనే కారణంతో ఎరువుల ధరలు పెంచినట్టు కంపెనీల యజమానులు పేర్కొంటున్నారు. డీఏపీ ధర రూ.1,350, యూరియా ధర రూ.266.50 మాత్రం పెరగలేదు. ప్రస్తుతం మార్కెట్లో ధర పెరిగిన ఎరువుల బస్తాలనే వ్యాపారులు విక్రయిస్తున్నారు.

ఈ ఏడాది యాసంగి సీజన్‌లో సాగు విస్తీర్ణం పెరగనుందని వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేశారు. ఈ సీజన్‌లో యాదాద్రి జిల్లాలో సుమారు 20వేల టన్నుల కాంప్లెక్స్, సూర్యాపేట జిల్లాలో సుమారు 30వేల టన్నులు, నల్లగొండ జిల్లాలో సుమారు 50వేల టన్నుల కాంప్లెక్స్ ఎరువులు వినియోగిస్తారని అంచనా. బస్తాకు రూ.100 చొప్పున పెరుగుదలను లెక్కిస్తే ఉమ్మడి జిల్లా రైతులపై రూ.20కోట్ల అదనపు భారం పడుతోంది.

పెరిగిన ధరలు ఇలా..

ఎరువు రకం	గత ఏడాది ధర	వానకాలం ధర	పెరుగుదల	యాసంగి ధర	పెరుగుదల
20-20-0-13	1,300	1,400	100	1,450	50
10-26-26	1,470	1,800	330	1,900	100
15-15-15-0-9	1,450	1,600	150	1,650	50
16-20-0-13	1,250	1,300	50	1,400	100
14-35-14	1,700	1,800	100	1,900	100
28-28-0	1,600	1,700	100	1,800	100

నేడు 'మహిళా శక్తి' చీరల పంపిణీ



నల్లగొండ రూరల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ఈ నెల 22న 'ఇందిర మహిళా శక్తి' చీరల పంపిణీ కార్యక్రమాన్ని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ప్రారంభిస్తారని కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు. శుక్రవారం సాయంత్రం నిర్వహించిన టెలీకాన్ఫరెన్స్‌లో ఆమె మాట్లాడారు. ఈ నెల 22 నుంచి 24వ తేదీ వరకు చీరల పంపిణీని పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులను భాగస్వాములను చేయాలన్నారు. జిల్లాకు 4.34లక్షల చీరలు అవసరం కాగా, ఇప్పటి వరకు 3.50లక్షల చీరలు చేరాయన్నారు. మిగతా 84వేల చీరలు ఈ నెల 22న వస్తాయని చెప్పారు. టెలీ కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ నారాయణ్ అమిత్, డీఆర్డీవో శేఖర్‌రెడ్డి, ఆర్డీవో అశోక్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

తక్షణమే రక్షణ చర్యలు చేపట్టాలి

ఎస్పీ శరత్‌చంద్ర పవార్



ఈదులగూడ వై-జంక్షన్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ శరత్‌చంద్ర పవార్

మిర్యాలగూడ, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): బ్లాక్‌స్పాట్ల వద్ద తక్షణమే రక్షణ చర్యలు చేపట్టాలని అధికారులను ఎస్పీ శరత్‌చంద్ర పవార్ ఆదేశించారు. శుక్రవారం అద్దంకి-నార్కెట్‌పల్లి రహదారిపై మిర్యాలగూడ వద్ద నందిపాడు, ఈదులగూడ వై-జంక్షన్ గూడూరు, వాడపల్లి వద్ద బ్లాక్‌స్పాట్లను పరిశీలించారు. ఈదులగూడెం వై-జంక్షన్ వద్ద విలేకరులతో మాట్లాడుతూ, అతివేగం, రాంగ్‌రూట్, లైటింగ్ సమస్యతో ప్రమాదాలు జరుగుతున్నట్లు గుర్తించామన్నారు. బ్లాక్‌స్పాట్ల వద్ద ప్రత్యేక రక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించామన్నారు. జంక్షన్ల వద్ద గ్రామాల నుంచి వచ్చే అప్రోచ్‌రోడ్లపై స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలన్నారు. వాటికి రంగులు వేయాలని, డంబెల్ స్టిక్స్ స్పీడ్ స్టాపర్ల ఏర్పాటుకు వారంలోగా చర్యలు తీసుకోవాలని నామ్ ఇంజనీర్లకు సూచించామన్నారు. నందిపాడు క్రాస్‌రోడ్ వద్ద రాంగ్‌రూట్‌లో వాహనాలు నడపకుండా ట్రాఫిక్ పోలీస్ ఔట్‌పోస్టును ఏర్పాటు చేయాలని డీఎస్పీని ఆదేశించామన్నారు. గూడూరు వద్ద రోడ్డు క్రాసింగ్‌కు ఊరు మధ్యలో ఓపెన్ చేసిన డివైడర్‌ను మూసివేసి దామరచర్ల, మిర్యాలగూడ వైపు తెరవాలన్నారు. ఎస్పీ వెంట మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖర్‌రాజు, వన్‌టౌన్ సీఐ నాగభూషణం, ఎస్ఐ సైదిరెడ్డి, రాంబాబు, తదితరులు ఉన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

డీఎంహెచ్‌వో పుట్ల శ్రీనివాస్



ఆస్పత్రిలో రికార్డులను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో శ్రీనివాస్

పెద్దఅడిశర్లపల్లి, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధులపై వైద్యులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్‌వో పుట్ల శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని గుడిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన తనిఖీచేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రసూతి, తదితర రికార్డుల నిర్వహణ సరిగా ఉండాలన్నారు. సీజనల్ వ్యాధులు, జ్వరాలు, కుక్క కాటు కేసుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రత్యేకంగా ల్యాబ్‌లో ఆటో ఎనలైజర్ వాడుతున్నందుకు సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన వెంట డిప్యూటీ డీఎంహెచ్‌వో రవి, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ప్రియాంక, తదితరులు ఉన్నారు.

లాటరీ విధానంలో లబ్ధిదారుల ఎంపిక

చింతపల్లి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నెల్వలపల్లిలో నిర్మించిన 20 డబుల్ బెడ్ రూమ్ ఇళ్లకు శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో అధికారులు లాటరీ విధానంలో లబ్ధిదారులను ఎంపిక చేశారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లకు అర్హులు 33మంది ఉండగా, అందులో 20 మందిని ఎంపిక చేశారు. కార్యక్రమంలో హౌసింగ్ పీడీ రాజ్‌కుమార్, తహసీల్దార్ విజయలక్ష్మి, ఎంపీడీవో సుజాత, డీఈ నాగేంద్ర, డీటీ హర్షద్, పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి గిరిజనుల వద్దకే

» 'ప్రజావాణి'లో ఫిర్యాదుతో కదలిన అధికారులు
» తండాకు వచ్చిన కలెక్టర్, ఎమ్మెల్యే



చెంచోనితండాలో పర్యటిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి, తదితరులు

తిరుమలగిరి(సాగర్), నవంబరు 21(ఆంధ్రజ్యోతి): తండాలో నెలకొన్న సమస్యలపై ఆదెమ్మ అనే మహిళ జిల్లా కేంద్రంలో 'ప్రజావాణి'లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు అధికారులు కదిలారు. మండలంలోని మారుమూల ప్రాంతమైన చెంచోనితండాకు కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి, ఇతర అధికారులు శుక్రవారం వచ్చారు. తండాలో ఆధార్‌కార్డులు, ప్రభుత్వ ధ్రువపత్రాలు లేనివారి కోసం ప్రత్యేకంగా ఆధార్, మీ-సేవా సిబ్బందితో ప్రత్యేక శిబిరం నిర్వహించారు. దీంతో తండాకు చెందిన 72 మంది ఆధార్‌లో మార్పులు చేర్పులు చేయించుకోగా, నేటికీ ఆధార్ కార్డు లేని 21 మందికి నూతనంగా జారీచేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి తండావాసుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సంతానం ఎక్కువగా ఉన్న కుటుంబాలకు ప్రభుత్వం ఇచ్చే ఆరు కిలోల బియ్యం సరిపోవడంలేదని, 32 కిలోల బియ్యం కోసం అంత్యోదయకార్డులు ఇవ్వాలని స్థానికులు విన్నవించారు. కొంతమందికి రేషన్‌కార్డులు, ఉపాధిహామీ జాబ్‌కార్డులు లేవని చెప్పగా, పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని వారు హామీ ఇచ్చారు. తాగునీటి బోర్‌కు మరమ్మతులు చేయిస్తామని, సెల్‌ఫోన్ సిగ్నల్ విషయమై సంబంధిత అధికారులతో మాట్లాడతామన్నారు. పెన్షన్లు ప్రతినెలా తీసుకోవాలని, రైతులు కొత్తగా అటవీ భూములను నరకవద్దని సూచించారు. చెంచుల అభివృద్ధికి అన్ని విధాలా సహకరిస్తామన్నారు. ఇందిరమ్మ ఆత్మీయభరోసా, పెన్షన్ల కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రభుత్వ ఆస్పత్రిలో అన్ని రకాల సదుపాయాలు ఉన్నందున అక్కడే చికిత్స చేయించుకోవాలని సూచించారు. తండాకు చెందిన వారినే ఆశా, అంగన్‌వాడీ, ఏఎన్ఎంలుగా నియమించేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరగా కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. తండాలో ఎమ్మెల్యే, కలెక్టర్, అధికారులు కలియ తిరుగుతూ సమస్యలను పరిశీలించారు. గ్రామపంచాయతీ, అంగన్‌వాడీ కేంద్రాలకు పక్కా భవనాలు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నారాయణ్‌అమిత్, డీఆర్‌డీఏ పీడీ శేఖర్‌రెడ్డి, హౌసింగ్ పీడీ రాజ్‌కుమార్, డీఎంహెచ్‌వో డాక్టర్ పుట్ల శ్రీనివాస్, జిల్లా పశుసంవర్థకశాఖ అధికారి డాక్టర్ రమేష్, హాలియా మార్కెట్ కమిటీ చైర్మన్ తుమ్మలపల్లి చంద్రశేఖర్‌రెడ్డి, తహసీల్దార్ అనిల్, ఎంపీడీవో భిక్షంరాజు, ఎంఈవో శ్రీనివాస్, ఏవో హర్షిత, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కలసాని చంద్రశేఖర్, గడ్డం సాగర్‌రెడ్డి, పాల్గొన్నారు.

బడి బయట పిల్లల కోసం

ప్రత్యేక సర్వే

» ప్రారంభించిన విద్యాశాఖ » సర్వే నిర్వహించనున్న సీఆర్పీలు



భువనగిరి రూరల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): బడి ఈడు పిల్లలు పాఠశాలలకు వెళ్లేలా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు ప్రారంభించింది. వివిధ కారణాలతో మధ్యలోనే పాఠశాలలకు దూరమైన వారిని గుర్తించి ప్రభుత్వ విద్యాసంస్థల్లో చేర్పించేందుకు సన్నద్ధమైంది.

రాష్ట్ర వ్యాప్తంగా 2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించి బడి బయట పిల్లలను గుర్తించేందుకు సర్వే నిర్వహించాలని రాష్ట్ర సమగ్ర శిక్ష సంచాలకుడు ఉత్తర్వులు జారీ చేశారు. ఈనెల 20 నుంచి డిసెంబరు 31 వరకు ఉమ్మడి నల్లగొండ జిల్లాలో మొత్తం 214 మంది క్లస్టర్ రిసోర్స్ పర్సన్లు (సీఆర్పీలు) ఈ సర్వేలో పాల్గొంటారు.

రెండు విభాగాలుగా

పాఠశాలలకు వెళ్లకుండా బాల కార్మికులుగా పని చేస్తున్న వారిని రెండు విభాగాలుగా గుర్తించేందుకు సర్వే నిర్వహిస్తున్నారు. సర్వేలో 6-14 ఏళ్లు, 15-19 ఏళ్ల వారిని వేర్వేరుగా గుర్తిస్తారు. సర్వే నిర్వహణపై జిల్లా స్థాయిలో ఒక్క రోజు శిక్షణ ఇచ్చినట్లు యాదాద్రి జిల్లా డీఈవో కె.సత్యనారాయణ తెలిపారు. పాఠశాల సముదాయాల పరిధిలో పని చేస్తున్న క్లస్టర్ రిసోర్స్ పర్సన్లకు (సీఆర్పీలు) సర్వే బాధ్యతలు అప్పగించారు.

ఉన్నతాధికారులకు నివేదికలు

పాఠశాలలకు వెళ్లకుండా ఉంటున్న వారి వివరాలను సీఆర్పీలు వారి పాఠశాలల పరిధిలో సేకరిస్తారు. చిన్నారుల ఇంటింటికీ వెళ్లి తల్లిదండ్రులతో మాట్లాడతారు. మండల స్థాయిలో ఎంఈవో, స్కూల్ కాంప్లెక్స్ పాఠశాలల హెచ్ఎంల ఆధ్వర్యంలో నిర్వహించిన సర్వే నివేదికను ప్రతీ రోజు జిల్లా విద్యాధికారికి అందజేయనున్నారు. డిసెంబరు 31వ తేదీ వరకు సర్వే పూర్తి కావాల్సి ఉంది. ఆ తర్వాత మండల విద్యాధికారులు 2026, జనవరి 2 వరకు డీఈవోలకు, జనవరి 12 వరకు జిల్లా విద్యాశాఖ అధికారులు రాష్ట్రస్థాయి విద్యాశాఖ అధికారులకు నివేదికలు అందజేస్తారు. సర్వే వివరాలను కేంద్ర ప్రభుత్వం ఆధీనంలోని 'ప్రబంధ్ పోర్టల్‌తో పాటు 'చైల్డ్ ఇన్ఫో' వెబ్‌సైట్‌లో నమోదు చేస్తారు. గతంలో సేకరించిన వివరాలను నమోదు చేస్తారు.

క్షయ రహిత సమాజం కోసం కృషి



న్యూట్రీషన్ కిట్ అందజేస్తున్న కల్యాణచక్రవర్తి

శాలిగౌరారం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): క్షయ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా క్షయ వ్యాధి నివారణాధికారి కల్యాణ చక్రవర్తి కోరారు. శుక్రవారం స్థానిక పీహెచ్‌సీని ఆయన తనిఖీచేశారు. అనంతరం భారతి రంగ ఆర్గనైజేషన్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో పోషకాహార కిట్లను క్షయ వ్యాధిగ్రస్థులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లాలో 2వేల మందికి పైగా క్షయవ్యాధిగ్రస్థులు ఉన్నారని, వ్యాధి నివారణకు పెద్ద ఎత్తున ప్రచారం చేస్తున్నామన్నారు. వ్యాధి లక్షణాలు కనబడితే వెంటనే గుర్తించి తగిన చికిత్స చేయించుకోవాలన్నారు. వైద్య సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే సహించేదిలేదన్నారు. ఆయన వెంట మండల వైద్యాధికారి సూర్య శిల్ప, శ్వేత, ఎస్.రాములమ్మ, సూపర్ వైజర్లు మరియా, దయామణి, యాసారపు రామకృష్ణ, సైదులు, హెల్త్ అసిస్టెంట్ మొలుగూరి భాస్కర్, శ్రీనివాస్, తదితరులు ఉన్నారు.

బీసీ రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించాలి

బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనారాయణ



కలెక్టరేట్ ముట్టడిలో మాట్లాడుతున్న లక్ష్మీనారాయణ

నల్లగొండ (కలెక్టరేట్), నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): బీసీ రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించాకే స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు దుడుకు లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడారు. కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌తో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండేళ్లు గడుస్తున్నా 42శాతం రిజర్వేషన్లపై మాట్లాడకపోవడం శోచనీయమన్నారు. రిజర్వేషన్లపై పలు ఆందోళనల అనంతరం అసెంబ్లీలో ఏకగ్రీవ తీర్మానం చేసి గవర్నర్‌కు, రాష్ట్రపతికి పంపించారన్నారు. ప్రధానమంత్రిని హైదరాబాద్‌కు రప్పిస్తానంటూ ప్రగల్భాలు పలికిన సీఎం రేవంత్‌రెడ్డి 56 సార్లు ఢిల్లీకి వెళ్లినా ఒక్కసారి కూడా ప్రధానిని కలవకపోవడం శోచనీయమన్నారు. ధర్నా అనంతరం కలెక్టరేట్ ఏవోకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కార్యదర్శి గుండు వెంకటేశ్వర్లు, నాయకులు సింగం లక్ష్మీనారాయణ, జెర్రిపోతుల రమేష్‌గౌడ్, అయితగోని జనార్దన్‌గౌడ్, కట్ట హరిబాబు, బక్కతట్ల వెంకన్నయాదవ్, కట్టకోలు దీపేందర్, మచ్చ నాగరాజు, తిరపతయ్యగౌడ్, పుట్టవెంకన్న, యాదగిరి, పాల్గొన్నారు.

రణభేరి సభను విజయవంతం చేయాలి

మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు మధుబాబు



సమావేశంలో మాట్లాడుతున్న లకుమాల మధుబాబు

నల్లగొండ టౌన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో ఈనెల 23న నిర్వహించే రణభేరి మహాసభను విజయవంతం చేయాలని మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు లకుమాల మధుబాబు పిలుపునిచ్చారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని మాలమహానాడు కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సుప్రీంకోర్టు సూచనలకు విరుద్ధంగా, 2011 జనాభా లెక్కలతో చేసిన ఎస్సీ వర్గీకరణను ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలన్నారు. జీవో 99ని సవరించాలని, మాలలతో పాటు గ్రూప్-3లో ఉన్న మరో 25 కులాలకు న్యాయం చేయాలన్నారు. చేవెళ్ల డిక్లరేషన్ ప్రకారం ప్రస్తుత జనాభాకు అనుగుణంగా ఎస్సీల రిజర్వేషన్ శాతాన్ని పెంచాలని, పెండింగ్‌లో స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. మాల కార్పొరేషన్ ఏర్పాటు చేసి రూ.1,000కోట్లు నిధులు కేటాయించాలన్నారు. రణభేరి మహాసభకు లక్షలాదిగా తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో సంఘం జిల్లా సోషల్ మీడియా అధ్యక్షుడు జంగాల వీరేందర్, నాయకులు రాయల మౌనిక, నాగమణి, శ్రీలత, వెంకన్న, సల్వాది ప్రభాకర్, జంగయ్య, రజనీకాంత్, శ్రీనివాస్, వెంకటేష్, తిరుమలేశ్, వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.



వైభవంగా సాహెబ్‌దర్గా గంధం ఊరేగింపు



ఆలేరులో గంధం ఊరేగింపులో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే సునీతామహేందర్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ పరమేశ్వర్

ఆలేరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : యాదాద్రిభువనగిరి జిల్లా ఆలేరు రామసముద్రం బైపాస్‌లోని అఫ్తానా హజ్రత్ సయ్యద్ బదియొద్దిన్ మహ్మద్ పీర్ మదార్ సాహెబ్ దర్గా ఉర్సు ఉత్సవాలు శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని కాటమయ్యనగర్‌లోని ఉత్సవ నిర్వాహకులు బీజని మధుకుమార్ గృహం నుంచి సాయంత్రం ప్రారంభమైన గంధం ఊరేగింపులో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకురాలు, ప్రభుత్వ మాజీ విప్ గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు మాజీ జడ్పీటీసీ బొట్ల పరమేశ్వర్‌తో పాటు ఉత్తరప్రదేశ్ రాష్ట్రం ఖాన్‌పూర్‌కు చెందిన మదర్ సాహెబ్ దర్గా నిర్వాహకులు కుద్బుల్ మదార్ హుజూర్ పక్రల్ ముసాయద్, ఆలే నబి, హజ్రత్ బిర్జాదాతో పాటు పలువురు నాయకులు, పట్టణ ప్రజలు హాజరయ్యారు. దర్గా వద్ద వరకు ఆటపాటలతో సాగిన ఊరేగింపు ఎంతో ఆకట్టుకుంది. సీఐ యాలాద్రి, ఎస్ఐ వినయ్‌కుమార్ బందోబస్తును పర్యవేక్షించారు. తెలుగురాష్ట్రాల నుంచి కాకుండా మహారాష్ట్ర నుంచి భక్తులు తరలివచ్చారు.

దేవరకొండ ఏఎస్పీ మౌనిక బదిలీ



దేవరకొండ, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ జిల్లా దేవరకొండ ఏఎస్పీ మౌనిక బదిలీ అయ్యారు. ఆదిలాబాద్ ఏఎస్పీగా బదిలీ చేస్తూ శుక్రవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. 10 నెలలుగా ఏఎస్పీ మౌనిక దేవరకొండ డివిజన్‌లో ఉద్యోగ బాధ్యతలు సమర్థంగా నిర్వహించారు.

మద్యం మత్తులో వాహనాలు నడిపితే చర్యలు



వాహనదారులను తనిఖీ చేస్తున్న ఎస్ఐ కృష్ణారెడ్డి

మర్రిగూడ, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : మద్యం మత్తులో వాహనాలు నడిపితే చర్యలు తప్పవని నల్లగొండ జిల్లా మర్రిగూడ ఎస్ఐ కృష్ణారెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని నర్సిపురం గేట్ వద్ద డ్రంకెన్ డ్రైవ్‌లో భాగంగా వాహనాల డ్రైవర్లను తనిఖీ చేశారు. మైనర్లు వాహనాలు నడిపితే తల్లిదండ్రులే బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. మద్యం మత్తులోనే ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ప్రతిఒక్కరూ ప్రయాణ సమయంలో బాధ్యతగా మెలగాలన్నారు. ఆయన వెంట కోటేష్, హుస్సేన్, అశోక్, అనిల్ ఉన్నారు.

హత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తి రిమాండ్



మహ్మద్ నవాజ్

భూదాన్‌పోచంపల్లి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : హత్యాయత్నం కేసులో నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు యాదాద్రిభువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లి ఎస్ఐ భాస్కర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన తెలిపిన వివరాల ప్రకారం భూదాన్‌పోచంపల్లికి చెందిన మహమద్ నవాజ్ ఈ ఏడాది సెప్టెంబరు 19న రాత్రి సమయంలో పాతకక్షలు మనసులో పెట్టుకొని తన మేన బావమరిది షేక్ నవీద్‌పై బీరు సీసాతో హత్యాయత్నం చేశాడు. అప్పటి నుంచి పరారీలో ఉన్న నవాజ్‌ను పోచంపల్లి పోలీసులు శుక్రవారం అరెస్టు చేసి నల్లగొండ జైలుకు రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

90 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

సూర్యాపేట క్రైం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : పేదలకు ప్రభుత్వం ప్రతి నెలా అందజేస్తున్న రేషన్ బియ్యాన్ని లబ్ధిదారుల నుంచి సేకరించి అధిక ధరలకు ఇతరులకు విక్రయించేందుకు నిల్వ చేసిన 90 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని సూర్యాపేట జిల్లా కేంద్ర పోలీసులు శుక్రవారం పట్టుకున్నారు. పట్టణ ఇన్‌స్పెక్టర్ వెంకటయ్య తెలిపిన వివరాల ప్రకారం సూర్యాపేట పట్టణంలోని బొడ్రాయి బజార్‌కు చెందిన రాచకొండ గణేష్ సూర్యాపేటతో పాటు సమీప గ్రామాల్లోని లబ్ధిదారుల నుంచి కొంతమొత్తంలో డబ్బులు చెల్లించి రేషన్‌బియ్యాన్ని కొనుగోలుచేశాడు. ఆ బియ్యాన్ని ఇంట్లో నిల్వచేశాడు. నిల్వచేసిన బియ్యాన్ని ఇతరులకు అధిక ధరలకు విక్రయించేందుకు సిద్ధమయ్యాడు. విశ్వసనీయ సమాచారం మేరకు గణేష్ ఇంటిపై దాడి చేయగా సుమారు 90 క్వింటాళ్ల రేషన్ బియ్యం లభించాయి. వెంటనే సివిల్ సప్లయ్ అధికారులకు సమాచారం ఇవ్వగా డీటీసీఎస్ రాజశేఖర్ సంఘటనా స్థలానికి చేరుకుని రేషన్ బియ్యంగా నిర్ధారణ చేశాడు. దీంతో డీటీసీఎస్ రాజశేఖర్ ఫిర్యాదు మేరకు బియ్యాన్ని స్వాధీనం చే సుకుని గణేష్‌పై కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ వెంకటయ్య తెలిపారు.

పైపైకి కోడిగుడ్డు ధరలు



కోడిగుడ్డు ధరలు ఆకాశాన్ని తాకుతున్నాయి. దీంతో కొనాలంటేనే ప్రజలు భయపడుతున్నారు. అక్టోబరు మొదటివారంలో 30 కోడిగుడ్ల ట్రే ధర రూ.150 ఉండగా ప్రస్తుతం రూ.180 నుంచి రూ.190 దాకా విక్రయిస్తున్నారు. ఒక్కో గుడ్డుకు గతంలో రూ.6.00 ఉండగా ప్రస్తుతం రూ.7 నుంచి రూ.8దాకా విక్రయిస్తున్నారు. ఓ వైపు కూరగాయల ధరలు భగ్గుమంటుంటే దానికి తోడు కోడిగుడ్డు ధరలు అమాంతం పెరుగుతుండటం ప్రజలను ఆందోళనకు గురిచేస్తోంది. ముఖ్యంగా రోగనిరోదక శక్తి పెంపొందించుకునేందుకు ప్రజలు కోడిగుడ్లను తింటుంటారు. అయితే ధరలు పెరుగుతుండటంతో కొనుగోళ్లు మందగించాయి.

(ఆంధ్రజ్యోతి-సూర్యాపేట టౌన్)

కోడిగుడ్ల ధరలు రోజురోజుకు పెరుగుతున్నాయి. అక్టోబరు నుంచి ఇప్పటి వరకు ఒక్కో కోడిగుడ్డుపై సుమారు రూ.2 వరకు పెరిగింది. ప్రస్తుతం రూ.7 నుంచి రూ. రూ.8 దాకా విక్రయిస్తున్నారు. జిల్లాలో ప్రస్తుతం రోజుకు 1.20 లక్షల నుంచి 1.35 లక్షల వరకు కోడిగుడ్లు విక్రయిస్తున్నట్లు అంచనా. సూర్యాపేట పట్టణంలో గతంలో రోజుకు 60 వేల కోడిగుడ్లు విక్రయించగా ప్రస్తుం ప్రస్తుతం 40 వేల నుంచి 50వేల వరకు విక్రయమవుతున్నాయి.

చలికాలం కావడంతో డిమాండ్

శరీరంలో ఉష్ణాన్ని పెంచేందుకు కోడిగుడ్డు ఉపకరిస్తుంది. ప్రస్తుతం చలికాలం కావడంతో పౌష్టికాహారమైన గుడ్డును తీసుకోవాలని ప్రజల్లో అవగాహన పెరిగింది. దీంతో డిమాండ్ కూడా పెరిగింది. వారంలో ఒకరోజు మాంసం కొనుగోలు చేస్తే వారంలో మూడు నుంచి నాలుగు రోజులు ఉదయం, సాయంత్రం ప్రజలు కోడిగుడ్డును వినియోగించేవారు. దీంతో ఈ కాలంలో కోడిగుడ్డుకు మంచి డిమాండ్ ఉంటుంది. అయితే చలి తీవ్రతతో కోడిగుడ్ల ఉత్పత్తి తగ్గడం, వినియోగం పెరగడం కూడా ధర పెరుగుదలకు కారణంగా వ్యాపారులు చెబుతున్నారు. జిల్లాకు కోడిగుడ్లు హైదరాబాద్, రంగారెడ్డి, వరంగల్ జిల్లాల నుంచి వస్తుంటాయని వ్యాపారులు తెలిపారు.

వ్యాపారం తగ్గుతోంది

కోడిగుడ్డు ధరలు పెరగడంతో వ్యాపారం తగ్గింది. గతంలో రూ.6 ఉండగా ప్రస్తుతం రూ.7.30 దాకా విక్రయిస్తున్నాం. గతంలో రెండు నుంచి మూడు రోజులు డజన్ వరకు కొనుగోల్లు చేసే వ్యక్తులు ధరలు అధికంగా ఉండడంతో రెండు, మూడు గుడ్లను మాత్రమేకొనుగోలు చేస్తున్నారు.

రాము, చికెన్ దుకాణా వ్యాపారి

వారంలో మూడురోజులు కోడిగుడ్డు



నిత్యం వెల్డింగ్ పని చేస్తా. రోగ నిరోధక శక్తి పెరగడానికి గుడ్డును తీసుకుంటాను. గతంలో వారంలో మూడురోజులు గుడ్డును తినేవాడిని. ప్రస్తుతం ధర పెరగడంతో ఇబ్బంది పడుతున్నా. మాంసం ధరలు, కూరగాయల ధరలు పెరిగిపోవడంతో తప్పని పరిస్థితుల్లో కోడిగుడ్లే కొంటున్నాం.

ములకలపల్లి మధు, ఎన్‌టీఆర్ కాలనీ

ధరలు పెరగడంతో తినడం తగ్గించాం



కోడిగుడ్డు ధరలు పెరుగుతుండడంతో కొనడం తగ్గించాం. ఇంట్లో చిన్నపిల్లలు ముగ్గురు ఉండడంతో బలంకోసం గుడ్లను కొనేవాళ్లం. ప్రస్తుతం చిన్న దుకాణాల్లో కోడిగుడ్డు ధర రూ. 8ఉండడంతో కొనలేక పోతున్నాం. కూరగాయలతో పాటు కోడిగుడ్డు ధరలు పెరగడం ఆందోళన కలిగిస్తోంది.

- ఇంద్రకంటి వెంకటేష్, అర్వపల్లి

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు



శాలిగౌరారం స్టేషన్‌లో రికార్డులను పరిశీలిస్తున్న డీఎస్పీ శివరాంరెడ్డి

శాలిగౌరారం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : శాంతిభద్రతల పరిరక్షణకు విఘాతం కలిగిస్తే కఠినచర్యలు తప్పవని నల్లగొండ డీఎస్పీ కే శివరాంరెడ్డి అన్నారు. నల్లగొండ జిల్లా శాలిగౌరారం పోలీస్‌స్టేషన్‌ను ఆయన శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా రికార్డులను, కేసులను పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. స్టేషన్ పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేస్తూ ఎస్ఐ సైదులు, సిబ్బందిని అభినందించారు. ఇదే స్ఫూర్తితో క్రైంరేట్ తగ్గించాలని సూచించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ దొంగతనాలు జరుగుతున్న నేపథ్యంలో కొత్త వ్యక్తులతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. స్థానిక ఎన్నికల్లో ఆయా పార్టీల నాయకులు గ్రామాల్లో శాంతిభద్రతలకు ఆటంకం కలిగించకుండా ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరుపుకోవాలన్నారు. ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో సీఐ కొండల్‌రెడ్డి, ఎస్ఐ సైదులు, హెడ్ కానిస్టేబుళ్లు సయ్యద్ నజీరుద్దీన్, ఉయ్యాల నర్సింహా, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాలను నివారించాలి

తిప్పర్తి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదాలను తగ్గించాలని డీఎస్పీ కే శివరాంరెడ్డి సూచించారు. శుక్రవారం నల్లగొండ జిల్లా తిప్పర్తి పోలీస్‌స్టేషన్‌ను ఆయన పరిశీలించారు. స్టేషన్ సిబ్బంది డ్యూటీలు, కేసు వివరాలు, పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నిత్యం ద్విచక్ర వాహనాలపై పెట్రోలింగ్ చేసే 100 కాల్ సిబ్బందికి హెల్మెట్లు ప్రధానం చేశారు. అదేవిధంగా ప్రతి ఒక్కరూ హెల్మెంట్ ధరించాలని సూచించారు. ఈ సందర్భంగా మొగిలి సతీష్, కడారి సతీష్‌లకు హెల్మెట్ ప్రధానం చేశారు. కార్యక్రమంలో ఆయన వెంట సీఐ కొండల్‌రెడ్డి, ఎస్ఐ వీ శంకర్ పాల్గొన్నారు.

దామరచర్ల ఎస్ఐపై చర్యలు తీసుకోవాలి



ఆందోళన చేస్తున్న కాంగ్రెస్‌పార్టీ నాయకులు

దామరచర్ల, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): అకారణంగా దూషించిన దామరచర్ల ఎస్ఐపై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ కార్యకర్తలు, స్థానికులు డిమాండ్ చేశారు. శుక్రవారం ఈ మేరకు నల్లగొండ జిల్లా దామరచర్ల మండల పరిధిలోని నార్కట్‌పల్లి-అద్దంకి రహదారిపై ఆందోళన చేపట్టారు. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. దామరచర్ల మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు అన్నెం కరుణాకర్‌రెడ్డి స్థానిక రామాలయంలో జరుగుతున్న అయ్యప్పస్వామి పూజకు వెళ్లేందుకు ద్విచక్రవాహనంపై రహదారి దాటుతున్నాడు. ఈ క్రమంలో సమీపంలో ఉన్న ఎస్ఐ శ్రీకాంత్‌రెడ్డి తన ద్విచక్ర వాహనాన్ని ఆపి రాంగ్‌రూట్‌లో ఎక్కడికి వెళ్తున్నావంటూ దూషించారని కరుణాకర్‌రెడ్డి వాపోయారు. సక్రమమైన మార్గంలో వస్తున్నానని, పూజా కార్యక్రమానికి వెళ్తున్నానని చెప్పగా, సెల్‌ఫోన్, వాహనం తాళాలు తీసుకుని, అసభ్య పదజాలంతో ఎస్ఐ తనను దూషించారన్నారు. ఈ ఘటనపై కాంగ్రెస్ నాయకులతో పాటు స్థానికులు ఆందోళనకు దిగటంతో పోలీసులు వారికి నచ్చజెప్పి ఆందోళనను విరమింపజేశారు. ఈ విషయమై ఎస్ఐ శ్రీకాంత్‌రెడ్డిని వివరణ కోరగా రాంగ్ రూట్‌లో వస్తున్న ద్విచక్ర వాహనాన్ని నిలిపి ప్రశ్నించానని, ఎవరినీ అసభ్య పదజాలంతో దూషించలేదన్నారు.

ఎస్ఐ ప్రవర్తనపై మొదటి నుంచీ విమర్శలు

దామరచర్ల ఎస్ఐగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి శ్రీకాంత్‌రెడ్డి వ్యవహార శైలిపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఆయా కేసుల నిమిత్తం స్టేషన్‌కు వెళ్తే అసభ్యపదజాలంతో దూషిస్తున్నారని పలువురు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఓ గిరిజన యువకుడిని స్టేషన్‌లో కొట్టారని హెచ్‌ఆర్‌సీ, ఎస్సీ, ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదుచేసిన ఘటనపై విచారణ కొనసాగుతోంది.

కల్వర్టు పైనుంచి కిందపడి వ్యక్తి మృతి



వీరస్వామి మృతదేహం

చారకొండ, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : కల్వర్టుపై కూర్చున్న ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు కింద పడి మృతి చెందాడు. ఈ సంఘటన నాగర్‌కర్నూలు జిల్లా చారకొండ మండలంలో గురువారం రాత్రి జరిగింది. ఎస్ఐ వీరబాబు తెలిపిన వివరాల ప్రకారం నల్లగొండ జిల్లా డిండి మండలంలోని బొల్లనపల్లి గ్రామానికి చెందిన పేట వీరస్వామి(60) బతుకుదెరువు కోసం 28 ఏళ్లుగా కుటుంబ సభ్యులతో కలిసి హైదరాబాద్‌లో నివసిస్తున్నాడు. ఈ నెల 18న స్వగ్రామానికి వెళ్లాడు. గురువారం చారగొండ మండలంలోని సిరసనగండ్లలోని తన సోదరి ఇంటికి బయలుదేరాడు. మార్గమధ్యలో శాంతిగూడెం వద్ద, రోడ్డు పక్కనున్న కల్వర్టుపై కూర్చొని, అదుపుతప్పి కిందపడి మృతి చెందాడు. శుక్రవారం ఉదయం స్థానికుల సమాచారంతో ఎస్ఐ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కుటుంబ సభ్యులకు తెలిపి, మృతదేహాన్ని కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వీరస్వామికి భార్య మల్లమ్మ, ఇద్దరు కుమారులు ఉన్నారు. వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

నల్లగొండ క్రైం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ జిల్లా నల్లగొండ మండల పరిధిలోని పారేపల్లిగూడెం, రంగారెడ్డినగర్ వద్ద గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. యాదప్ప, గణేష్‌లు నల్లగొండలో పని ముగించుకొని మునుగోడుకు ద్విచక్రవాహనంపై వెళ్తున్నారు. ఆ సమయంలో రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. ఇద్దరికీ తీవ్రగాయాలు కావడంతో జిల్లా కేంద్ర ఆస్పత్రి తరలించగా చికిత్స పొందుతున్నారు. ప్రమాదం ఏవిధంగా జరిగిందనేది తెలియాల్సి ఉంది. ఈ ఘటనపై ఫిర్యాదు రాలేదని రూరల్ పోలీసులు తెలిపారు.

సూర్యాపేటలో నేటి నుంచి రాష్ట్ర స్థాయి వాలీబాల్ టోర్నమెంట్

సూర్యాపేట(కలెక్టరేట్), నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో నేటి నుంచి రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలు జరుగనున్నాయి. సూర్యాపేట వాలీబాల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు నిర్వహించే రాష్ట్ర స్థాయి యూత్, బాలుర, అండర్-17 బాలికల విభాగంలో వాలీబాల్ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఫౌండేషన్ వ్యవస్థాపకుడు ఎడవెల్లి ప్రవీణ్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 22న క్రీడాపోటీలు ప్రారంభమవుతాయని, 23న సాయంత్రం క్రీడలు ముగింపు ఉంటుందన్నారు. టోర్నమెంట్‌కు క్రీడాకారులు, క్రీడాభిమానులు పెద్దసంఖ్యలో హాజరై విజయవంతం చేయాలన్నారు. క్రీడల ప్రారంభోత్సవానికి ఎస్పీ కొత్తపల్లి నర్సింహ హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు క్రీడల కన్వీనర్ ఎడవెల్లి ప్రవీణ్‌కుమార్ సెల్ 9000272624, 7995223433ను సంప్రదించాలన్నారు.

ప్రతిభచూపిన బాలికలు జాతీయ పోటీలకు ఎంపిక



భువనగిరిలో ఆస్మిత్ లీగ్ పోటీలో ఎంపికైన క్రీడాకారులు

భువనగిరి గంజ్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : ఒలంపిక్ లక్ష్యంగా నిర్వహిస్తున్న లీగ్ పోటీల్లో ప్రతిభ చూపిన బాలికలను జాతీయ పోటీలకు ఎంపిక చేస్తామని నిర్వాహక అధ్యక్షుడు పోతంశెట్టి వెంకటేశ్వర్లు శుక్రవారం తెలిపారు. యాదాద్రిభువనగిరి జిల్లా కేంద్రంలో ఖేలో ఇండియా అథ్లెటిక్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా సంయుక్తంగా నిర్వహిస్తున్న ఆస్మిత్ లీగ్ బాలికల ఎంపిక పోటీలను భువనగిరి ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో నిర్వహిస్తున్నారు. ఇందులో గ్రామీణ విద్యార్థుల్లోని నైపుణ్యం గల వారిని అథ్లెటిక్స్ ఫెడరేషన్ గుర్తించి ఎంపిక చేయనుంది. ఈ పోటీల్లో విజేతలకు మెడల్స్ ధ్రువపత్రాలు అందజేస్తామని వెంకటేశ్వర్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడల అధికారి ధనంజనేయులు, కళాశాల ప్రిన్సిపాల్ కరుణాకర్, ప్రధానకార్యదర్శి కోనేటి గోపాల్, కొలుపుల అమరేందర్, ప్రసాద్, హరిబాబు, వినోద్, సునీల్, హర్ష, అనిల్‌కుమార్, హేమావతి, సునీల్, నవీన్, గణేష్, రాము, జ్యోతి, అనిత, సుమలత, శివాని, మహేష్ పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లా క్రికెట్ జట్ల ఎంపిక పోటీలు రేపు

నల్లగొండ స్పోర్ట్స్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి నల్లగొండ జిల్లా అండర్-14 బాలుర క్రికెట్ జట్ల ఎంపిక పోటీలు ఈ నెల 23వతేదీన నల్లగొండ జిల్లా కేంద్రంలోని మేకల అభినవ్ స్టేడియంలో నిర్వహిస్తున్నట్లు జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి సయ్యద్ అమీనోద్దిన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీల్లో ఎంపికైన ఆరు జట్లకు జిల్లా వేదికగా నవంబరు చివరి వారంలో వన్‌డే లీగ్ టోర్నమెంట్ నిర్వహిస్తామన్నారు. ఇందులో రాణించిన క్రీడాకారులను ఉమ్మడి నల్లగొండ జిల్లా అండర్-14 క్రికెట్ జట్టుకు ఎంపిక చేస్తామన్నారు. సెప్టెంబరు 2011లో జన్మించిన ఆసక్తి గల ఔత్సాహిక క్రీడాకారులు వయస్సు ధ్రువీకరణ పత్రం, ఆధాకార్డుతో హాజరుకావాలని ఇతర వివరాలకు 9885717996 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

ప్రాంతీయ పార్టీలను బొందపెట్టాలనే ప్రయత్నం



విలేకరులతో మాట్లాడుతున్న సునీత

ఆలేరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : కేంద్రంలో, రాష్ట్రంలో అధికారంలో ఉన్న బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు దక్షిణ భారతదేశంలోని ప్రాంతీయ పార్టీలను, ప్రభుత్వాలను బొందపెట్టే ప్రయత్నాలకు పాల్పడుతున్నాయని ఆలేరు మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి ఆరోపించారు. శుక్రవారం యాదాద్రిభువనగిరి జిల్లా ఆలేరులో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రాంతీయ పార్టీల్లో యువనాయకత్వం ఎదగకుండా ఉండాలని ప్రధాని నరేంద్రమోదీ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిలు చూస్తూ రాజకీయ కక్ష్య సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని, అందులో భాగంగానే ఎమ్మెల్యే కేటీఆర్‌ను ఫార్ములా కార్ రేసులో ఇరికించారన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు పుట్ట మల్లేష్, పూర్వ జడ్పీటీసీ బొట్ల పరమేశ్వర్, నాయకులు వెంకటేష్, సుధీర్, కొమ్మరాజుల అశోక్, శివమల్లు, ఎండీ ఫయాజ్, రవీందర్, భరత్ పలువురు పాల్గొన్నారు.

వాచ్‌మన్‌పై వ్యక్తి దాడి

నల్లగొండ క్రైం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ జిల్లా కేంద్రంలోని శాంతినగర్‌లోని ఓ ప్రైవేట్ పాఠశాలకు చెందిన వాచ్‌మన్‌పై ఓ వ్యక్తి కత్తితో దాడి చేశాడు. ఈ సంఘటన శుక్రవారం జరిగింది. ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన పండ్ల వ్యాపారి వాచ్‌మన్‌పై దాడికి పాల్పడినట్లు తెలిసింది. పండ్ల బండిని పక్కన బెట్టుకోవాలని వాచ్‌మన్ చెప్పడంతో కోపోద్రిక్తుడైన వ్యాపారి కత్తితో దాడి చేయగా చేతి వేళ్లకు గాయాలయ్యాయి. వన్‌టౌన్ పోలీసులు విచారణ చేస్తున్నారు.

గొర్రెలు, మేకల పెంపకంపై అవగాహన

రాజాపేట, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : యాదాద్రిభువనగిరి జిల్లా రాజాపేట మండలం బొందుగులలో పశుసంవర్ధక శాఖ, ఇంటాస్ ఫార్మ కంపెనీ ఆధ్వర్యంలో శుక్రవారం గొర్రెలు, మేకల పెంపకందారులకు అవగాహన శిబిరాన్ని నిర్వహించారు. చలికాలంలో జీవాల సంరక్షణ, జాగ్రత్తలు, గడ్డి సాగు తదితర అంశాలపై పశువైద్యాధికారి డాక్టర్ చంద్రారెడ్డి, తుర్కపల్లి మండల పశువైద్యాధికారి రామచంద్రారెడ్డిలు వివరించారు. కార్యక్రమంలో బుచ్చయ్య, శ్రీనివాస్‌రెడ్డి, సిద్ధులు, మహేష్, శ్రీకాంత్, భానుచందర్, అజయ్‌కుమార్ పాల్గొన్నారు.

విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చేయాలి



మిర్యాలగూడ సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న విద్యార్థులు

మిర్యాలగూడ, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): వసతిగృహాల్లో ఉండి చదువుకునే విద్యార్థులు చలికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వెంటనే వారికి దుప్పట్లు పంపిణీ చేయాలని ఎస్ఎఫ్ఐ కేంద్ర కమిటీ సభ్యుడు ఖమ్మంపాటి శంకర్ డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం నల్లగొండ జిల్లా మిర్యాలగూడ సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. చలి తీవ్రత పెరగడంతో జిల్లా వ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ వసతిగృహాలు, గురుకుల, కస్తూర్బా బాలికల పాఠశాలల విద్యార్థులు సొంత భవనాలు లేక, వసతిగృహాల్లో సరైన తలుపులు, కిటికీ లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. నల్లగొండ జిల్లాలోని వసతిగృహాల్లో 43వేల మంది విద్యార్థులకు మందపాటి దుప్పట్లు, రగ్గులను పంపిణీ చేయాలని కోరారు. అనంతరం కార్యాలయ అధికారికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మిర్యాలగూడ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు మూడావత్ జగన్‌నాయక్, కుర్ర సైదానాయక్, వేములపల్లి మండల కార్యదర్శి పుట్ట సంపత్, అంజి, సిపాయి, రాజేష్, సాయి, హనుమంతు, నవీన్ సూర్య, సుబాని, బన్ని తదితరులు పాల్గొన్నారు.

హాలియాలో...

హాలియా : స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులు ధర్నా నిర్వహించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఆకారపు నరేష్ మాట్లాడుతూ తీవ్ర చలికి విద్యార్థులు అనారోగ్యం పాలవుతున్నారన్నారు. కార్యక్రమంలో డివిజన్ కార్యదర్శి కోరే రమేష్, ఉపాధ్యక్షుడు వర్షిత్, రవి, చందు, వెంకట్, విద్యార్థులు పాల్గొన్నారు.

కన్నుల పండువగా సీతారామచంద్రస్వామి శాంతి కల్యాణం



సూర్యాపేటోని వేదాంత భజన మందిరంలో 1116 దీపాలు వెలిగించిన భక్తులు

సూర్యాపేట టౌన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని బొడ్రాయిబజార్ వేదాంత భజన మందిరంలో శ్రీసీతారామచంద్రస్వామి శాంతికల్యాణం గురువారం రాత్రి అంగరంగవైభవంగా జరిగింది. అర్చకులు దరూరి సింగరాచార్యులు ఆధ్వర్యంలో స్వామి, అమ్మవారల విగ్రహాలను పట్టువస్త్రాలతో అలంకరించి ప్రత్యేకపూజలు నిర్వహించారు. ప్రత్యేక మండపంలో కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. అనంతరం 1116 దీపాలతో కార్తీక దీపోత్సవం జరిపించారు. ఊంజల్ సేవ నిర్వహించి భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో దేవాలయ కమిటీ అధ్యక్షుడు రాచర్ల వెంకటేశ్వర్‌రావు, ప్రధాన కార్యదర్శి నకిరేకంటి నాగరాజు, కోశాధికారి సోమ అశోక్, అర్చకులు దరూరి రాఘవాచార్యులు, జక్కుల గిరి, కక్కిరేణి భరత్, వేణు, వనమాల భిక్షపతి, ఓరుగంటి చంద్రశేఖర్, సోమ సుమన్, శీలా శంకర్, భరత్, కొత్తూరు రాజు, కొత్తురు స్వాతి, ప్రేమలత, హేమలత, బిందు, శోభా, రమాదేవి, యామిని పాల్గొన్నారు.

లక్ష్మీనృసింహాస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

హుజూర్‌నగర్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : పట్టణ పరిధిలోని ముక్త్యాల బ్రాంచ్ కెనాల్ సమీపంలోని పడిగరాయి గట్టు లక్ష్మీనృసింహాస్వామి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నవితరణ చేశారు. మహిళ భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి పూజలు చేశారు. కార్యక్రమంలో కృష్ణారెడ్డి, వెంకటేశ్వరరావు, గుర్రం వెంకటరెడ్డి, సర్వ య్య, కోటేశ్వరరావు, నరేందర్‌రెడ్డి, ప్రియాంక, శ్రీనివాసరావు, మల్లేశ్వరి, నాగరాజు, శంకరమ్మ, గుర్నాథం, అంజిరెడ్డి, సీతమ్మ పాల్గొన్నారు.

శివాలయంలో శాంతి కల్యాణం



ప్రత్యేకాలంకరణలో శ్రీభీమలింగేశ్వరస్వామి

పట్టణంలోని శ్రీ పార్వతీ సహిత భీమలింగేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం కార్తీకమాసం ముగింపు సందర్భంగా శాంతి కల్యాణం నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య శ్రీపార్వతీ, పరమేశ్వరుల కల్యాణతంతు కనుల పండువగా నిర్వహించారు. కార్యక్రమంలో ఈట కొండారెడ్డి, గజ్జి విజయలక్ష్మీప్రభాకర్, కీతా మల్లికార్జున్, గుండా శ్రీనివాసు, అరవిందరెడ్డి, శ్రీనివాసరెడ్డి, కోట సూర్యప్రకాశ్‌రావు, ఏలూరి రాంబాబు, ఓరుగంటి నాగేశ్వరరావు, శ్రీధర్, వాసు తదితరులు పాల్గొన్నారు.

నృసింహ క్షేత్రంలో వైభవంగా సువర్ణ పుష్పార్చన



ఊంజల్ సేవోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామివారి సన్నిధిలో శుక్రవారం స్వామివారికి సువర్ణపుష్పార్చన, అమ్మవారికి ఊంజల్ సేవోత్సవం వైభవంగా జరిపారు. ఆగమశాస్త్రరీతిలో వేడుకలు నిర్వహించిన పూజారులు వేకువజామున సుప్రభాత సేవతో స్వయంభువులను మేల్కొలిపి పంచామృతాలు, వేదమంత్ర పఠనాలతో అభిషేకం, తులసీదళాలు, కుంకుమతో అర్చించగా హోమం, నిత్యకల్యాణం సంప్రదాయరీతిలో కొనసాగాయి. మంగళవాయిద్యాలు, మహిళా భక్తుల మంగళ నీరాజనాల మధ్య ఊంజల్ సేవోత్సవం నేత్రపర్వంగా సాగింది. పాతగుట్ట ఆలయంలో నిత్య పూజలు సాంప్రదాయ రీతిలో కొనసాగాయి. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల నుంచి రూ. 16,41,672 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో ఎస్. వెంకట్రావు తెలిపారు.

కమనీయం.. కల్యాణం

మఠంపల్లి: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం మట్టపల్లి లక్ష్మీ నృసింహుడి క్షేత్రంలో శుక్రవారం రాజ లక్ష్మీ, చెంచులక్ష్మీ సమేత లక్ష్మీనరసింహుడి నిత్యాకల్యాణాన్ని వేదపండితులు వైభవంగా నిర్వహించారు. మధ్యాహ్నం అమ్మవారికి కుంకుమార్చన, విశేషపర్వాలు నిర్వహించారు. కార్తిక మాసాన్ని పురష్కరించుకొని మట్టపల్లి మహాక్షేత్రంలో భక్తులు కోటి దిపాలు వెలగించి భక్తి చాటుకున్నారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ చెన్నూరి విజయ్‌కుమార్, మట్టపల్లి రావు, ఈవో సిరికొండ నవీన్ పాల్గొన్నారు.

కృష్ణమ్మకు మంగళ హారతి

మట్టపల్లి నరసింహుని క్షేత్రంలో శుక్రవారం కృష్ణమ్మకు వేద పండితులు, మహిళలు, భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పవిత్ర కృష్ణానదికి పసుపు, కుంకుమార్చనలు, అభిషేకాలు, చీర సారె సమర్పించారు.



మట్టపల్లిలో కోటి దీపోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

సహృదయం పరిమళించిన వేళ..

● అనాథ వయోవృద్ధులకు అండగా ఆశ్రమం ● హిందూ సంప్రదాయరీతిలో అంత్యక్రియలు చేస్తున్న ముస్లిం దంపతులు

మాయమైపోతున్నడమ్మ మనిషన్నవాడు.. మచ్చుకైన లేడు చూడు.. మనసున్న వాడు.. నూటికో కోటికో ఒక్కడే ఒక్కడు ఏడ చూసిన కాని కంటికి కానరాడు.. అంటూ అంతరించిపోతున్న మానవ విలువలపై ఓ కవి రాసిన గేయం నేటి సమాజంలో అక్షరాల నిజమనిపిస్తుంది. ఎందుకంటే అందరూ ఉన్న అనాథలుగా మారుతున్నారు.

(ఆంధ్రజ్యోతి-భువనగిరి రూరల్)



భువనగిరి మండలం రాయిగిరిలో హిందూ సాంప్రదాయం ప్రకారం అంత్యక్రియలు నిర్వహిస్తున్న యాకూబీ చోటు

విద్యాబుద్ధులు నేర్పించి ఉన్నతంగా తీర్చిదిద్దిన తల్లిదండ్రుల ఆలనాపాలనను కొందరు పిల్లలు మరిచిపోతున్నారు. వృద్ధాప్యంలో అనాథ ఆశ్రమాలు, ప్రభుత్వ ఆసుపత్రులలో చేర్పించి వస్తున్నారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందితే కనికరం లేకుండా వదిలించుకుంటున్న ఘటనలు ఇటీవల ఎన్నో వెలుగు చూస్తున్నాయి. దీంతో ఆశ్రమ నిర్వాహకులు, మునిసిపాలిటీ, గ్రామపంచాయతీ సిబ్బంది దహన సంస్కారాలు నిర్వహించాల్సిన దుస్థితి నెలకొంది.

పేగుబంధం మరిచి..

జీవితంలో ప్రతీ ఒక్కరికి వృద్ధాప్యం తప్పనిసరి. చివరి అంకంలో తల్లిదండ్రులను కంటికి రెప్పలా చూసుకోవాల్సిన కొందరు పిల్లలు పేగు బంధం మరిచి, వారి బాగోగులను విస్మరిస్తున్నారు. అలా వీధిన పడేసిన ఎంతోమంది వృద్ధులను అక్కున చేర్చుకుంటున్నారు. జనగాం జిల్లా దేవరుప్పల మండలం సీతారాంపురానికి చెందిన యాకూబీ, చోటు దంపతులు 12ఏళ్ల క్రితం హనుమకొండలో సహృదయ అనాథ వృద్ధుల ఆశ్రమం స్థాపించారు. యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి మండలంలోని రాయిగిరి సమీపంలో 2019 జూన్‌లో మరో వృద్ధాశ్రమాన్ని ఏర్పాటు చేశారు. ప్రస్తుతం రాయిగిరిలో 40మంది అనాథ వృద్ధులు ఆశ్రయం పొందుతున్నారు. వీరందరికీ ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం, సాయంత్రం టీ, రాత్రికి నిర్ణీత సమయానికి భోజనాన్ని అందజేస్తున్నారు. చిన్న చిన్న రుగ్మతలకు స్థానికంగానే వైద్యం అందిస్తున్నారు. పరిస్థితి విషమిస్తే మెరుగైన చికిత్సకోసం అంబులెన్స్ వాహన సౌకర్యం ఉంది. కాలక్షేపానికి పత్రికలు, టెలివిజన్‌లతోపాటు వసతులను సమకూర్చారు. అదే విధంగా వీరు ముస్లీం అయి ఉండి కూడా హిందూ సంప్రదాయం మక్కువపై గణేశ్ నవరాత్రులను పురస్కరించుకుని ఆశ్రమంలో వినాయక విగ్రహాన్ని నెలకొల్పి పూజలు నిర్వహించడం విశేషం.

తెలంగాణ శాంతిదూత అవార్డు

భువనగిరి మండలం రాయిగిరిలో గల సహృదయ వృద్ధాశ్రమం నిర్వాహకురాలు యాకూబీ చోటుకు తెలంగాణ శాంతి దూత అవార్డు దక్కింది. అదే విధంగా అనాథ వయోవృద్ధుల బాగోగులను చూస్తూ వారి చివరి అంకం వరకు కృషి చేస్తున్నందుకు మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇటీవల ఉత్తమ అవార్డుకు ఎంపిక చేసింది. దీంతో ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జ్ఞాపికను అందజేశారు.

సేవే పరమావధిగా ..

అనాథ మృతదేహాలను కూడా వాళ్ల ఆచార వ్యవహారాల ప్రకారం అంతిమ సంస్కారం చేస్తున్నారు. ఆరు నెలల క్రితం రాయిగిరి అనాథఆశ్రమంలో ఇద్దరు వృద్ధులు మృత్యువాత పడడంతో హిందూ సంప్రదాయాల ప్రకారం వారి అంత్యక్రియలను నిర్వహించి గ్రామస్తుల మన్ననలు పొందారు.

సాగర్ సమాచారం

పూర్తిస్థాయి నీటి మట్టం	590.00 అడుగులు
ప్రస్తుత నీటి మట్టం	584.70 అడుగులు
ఎడమకాల్వకు నీటి విడుదల	3259 క్యూసెక్కులు
కుడికాల్వకు	9019క్యూసెక్కులు
విద్యుత్ కేంద్రం ద్వారా	నిల్
సాగర్‌కు నీటి రాక	నిల్
ఎస్ఎల్‌బీసీ ద్వారా	1800 క్యూసెక్కులు
అవుట్‌ఫ్లో	14,378 క్యూసెక్కులు
మొత్తం గేట్లు	నిల్
	- నాగార్జునసాగర్

పులిచింతల ప్రాజెక్టు

పూర్తిస్థాయి నీటి నిల్వ	45 టీఎంసీలు
ప్రస్తుత నీటి నిల్వ	42.88 టీఎంసీలు
నీటి రాక	1000 క్యూసెక్కులు
నీటి విడుదల	8000 క్యూసెక్కులు
	- చింతలపాలెం

మూసీ నీటిమట్టం

పూర్తిస్థాయి నీటి మట్టం	645 అడుగులు
ప్రస్తుత నీటి మట్టం	640 అడుగులు
నీటి రాక	1060 క్యూసెక్కులు
నీటి విడుదల	1064 క్యూసెక్కులు
	- కేతేపల్లి

శాలిగౌరారం ప్రాజెక్ట్

పూర్తిస్థాయి నీటి మట్టం	21 అడుగులు
ప్రస్తుత నీటి మట్టం	20 అడుగులు
నీటి రాక	నిల్
నీటి విడుదల	నిల్
	-శాలిగౌరారం

చికెన్ ధరలు

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.140	220	240
సూర్యాపేట	రూ.142	226	244
నల్లగొండ	రూ.145	224	248

మేక నుంచి మేకపోతుకు రక్త మార్పిడి



మేకపోతుకు రక్తం ఎక్కిస్తున్న అసిస్టెంట్ డైరెక్టర్ పెంటయ్య

కోదాడ రూరల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మేక నుంచి మేకపోతుకు రక్త మార్పిడిచేసి మేకపోతును ప్రాణాపాయం నుంచి కాపాడినట్లు సూర్యాపేట జిల్లా కోదాడ స్థానిక ప్రాంతీయ పశువైద్యశాల అసిస్టెంట్ డైరెక్టర్ పెంటయ్య తెలిపారు. పట్టణానికి చెందిన బసనబోయిన పున్నయ్య మేకపోతుకి గోమార్లుపట్టి రక్తం తాగడంతో గురువారంరాత్రి అకస్మాత్తుగా కిందపడిపోయిందన్నారు. దీంతో రాత్రి సమయంలో పశువైద్యశాలకు తీసుకురాగా పరీక్షించి రక్తహీనతగా ఉందని గుర్తించారు. వెంటనే రక్తానికి సంబంధించిన ప్లాస్మాను రక్తంలోకి ఎక్కించి, కొద్దిగా తేరుకున్న మేకపోతుకు పూర్తిస్థాయిలో కోలుకోవాలంటే తప్పనిసరిగా రక్తం ఎక్కించాల్సి ఉందన్నారు. వేరే మేక రక్తం ఎక్కించడానికి రక్తం సంచులు అందుబాటులో లేకపోవడం, రాత్రి సమయం కావడంతో తిరిగి శుక్రవారం ఉదయం అందుబాటులో ఉన్న వనరులతోనే రైతువద్ద ఉన్న ఇతర మేకల నుంచి మూడు మేకలరక్తం తీసి నేరుగా మేకపోతుకి మార్పిడి చేసినట్లు తెలిపారు. రక్తమార్పిడి అనంతరం మేకపోతు తేరుకుందని, మరోమారు రక్తం ఎక్కించాలని సూచించినట్లు తెలిపారు. మేకలు, గొర్రెల కొట్టాల్లో పరిశుభ్రత పాటించాలని, సంవత్సరంలో ఒకటి లేదా రెండుసార్లు పేలు, గోమార్ల నివారణ మందులు వాడాలని రైతులకు సూచించారు. ఈ చికిత్సలో సిబ్బంది రాజు, చంద్రకళ, అఖిల్, కరుణ్ పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన సేవలు అందించాలి

మర్రిగూడ, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాస్పత్రికి వైద్య సేవలకోసం వచ్చిన రోగులకు మెరుగైన సేవలు అందించాలని డీసీహెచ్ఎస్ డాక్టర్ మాతృనాయక్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని 30 పడకల సామాజిక ఆరోగ్య ఆసుపత్రిని తనిఖీ చేసి, స్టోర్ గదిలో ఉన్న మందులను పరిశీలించి, మందుల కొరతపై సూపరింటెండెంట్ డాక్టర్ శంకర్ నాయక్‌ను వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ ప్రభుత్వాస్పత్రిలో రెండు నెలల్లోనే పూర్తిస్థాయిలో వైద్య స్పెషలిస్టులను నియమించనున్నట్లు వివరించారు. వాతావరణ పరిస్థితులతో ఎక్కువశాతం ప్రజలు వైరల్ జ్వరాలు సోకి గురవుతున్నారన్నారు. ప్రస్తుతం ఆస్పత్రిలో మందులు కొరత ఏమిలేదని, మందులు అందుబాటులో ఉన్నాయని వెల్లడించారు. ప్రభుత్వ ఆస్పత్రి రోగులకు అత్యవసర వైద్య సేవలకోసం రోగులకు ఆక్సిజన్ అందించేందుకు 10 ఆక్సిజన్ బీడీ నేటర్స్ సిలిండర్లను అందుబాటులో ఉంచినట్లు వివరించారు. అదేవిధంగా త్వరలోనే ఈ ప్రభుత్వాస్పత్రిలో వివిధ రోగాలకు సంబంధించిన ఆపరేషన్లు కూడా నిర్వహిస్తామన్నారు. ప్రభుత్వాస్పత్రిలో సిబ్బంది కొరత లేదన్నారు. ఆస్పత్రికి వచ్చిన రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు వైద్యులు అందుబాటులో ఉంటున్నారని, అంతకు ముందు వైద్య సేవలకోసం వచ్చిన రోగులను సేవలు ఏ విధంగా అందుతున్నాయని అడిగి తెలుసుకున్నారు. ఆయనవెంట పీహెచ్‌సీ మండల వైద్యాధికారిని శాలిని, డాక్టర్ దీపక్, అరుణతార సిబ్బంది ఉన్నారు.

ఉత్తమ సింగిల్‌విండ్ చైర్మన్‌గా సంపత్‌రెడ్డి

తిప్పర్తి, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా ఉత్తమ సింగిల్ విండో చైర్మన్‌గా పాశం సంపత్‌రెడ్డి ఎంపిక అయ్యారు. తిప్పర్తి పీఏసీఎస్ చైర్మన్ నుంచి డీసీసీబీ డైరెక్టర్ వరకు పదవులు చేస్తూ మండల, జిల్లా రైతులకు అన్ని విధాలుగా అందుబాటులో ఉంటూ సేవలు అందించారు. ఈ సందర్భంగా రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి హైదరాబాద్‌లో అవార్డును అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా పాశం సంపత్‌రెడ్డి మాట్లాడుతూ తనకు ఇంత గుర్తింపు వచ్చేందుకు సహకరించిన ప్రతీ ఒక్కరికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో నల్లగొండ జిల్లా మార్కెట్ చైర్మన్ జూకూరి రమేష్, నాయకులు వనపర్తి శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.



సంపత్‌రెడ్డికి అవార్డు అందజేస్తున్న మంత్రి కోమటిరెడ్డి

స్వాతంత్ర్యం కోసం పోరాడిన మొదటి పార్టీ సీపీఐ

● మతోన్మాద మెడలు వంచేది కమ్యూనిస్టులే ● సాయుధ పోరాటమే అనేక ఉద్యమాలకు స్ఫూర్తి ● ఖమ్మంలో జరిగే సభకు లక్షలాదిగా తరలి రావాలి ● ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, రాష్ట్ర నేత పద్మ

అనంతగిరి, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): దేశ స్వాతంత్ర్యంకోసం పోరాడిన మొట్టమొదటి పార్టీ సీపీఐ అని ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం అన్నారు. పార్టీ వందే ఉత్సవాల ముగింపు సభ విజయవంతానికి ఈ నెల 15న గద్వాల్‌లో ప్రారంభమైన బస్సు జాత శుక్రవారం సూర్యాపేట జిల్లా అనంతగిరి మండలం శాంతినగర్ గ్రామానికి చేరుకుంది. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం మాట్లాడుతూ భారతదేశానికి సంపూర్ణ స్వాతంత్ర్యం కావాలని మొట్టమొదటగా గర్జించిన పార్టీ సీపీఐ అన్నారు. పార్టీ ఆవిర్భవించిన కాన్పూర్‌లో గత సంవత్సరం 26న ప్రారంభమై దేశవ్యాప్తంగా వంద ఏళ్ల ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయన్నారు. డిసెంబర్ 26న ఖమ్మంలో జరిగే సభకు లక్షలాదిగా తరలివచ్చి విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బద్దం కృష్ణారెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు బాల నరసింహ, జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు, జిల్లా కార్యవర్గ సభ్యులు మేకల శ్రీనివాస్, నారాయణరెడ్డి, మండవ వెంకటేశ్వర్లు, ఎస్‌కే సాయిబలి, ఎస్‌కే లతీఫ్, రాష్ట్ర మహిళా సమాఖ్య అధ్యక్షురాలు సృజన, మండల కార్యదర్శి రవి, సహాయ కార్యదర్శి లాలు పాల్గొన్నారు.

మతోన్మాదాన్ని రెచ్చగొడుతున్న బీజేపీ

వలిగొండ: కేంద్రంలో అధికారంలోకి వచ్చిన బీజేపీ మతోన్మాదాన్ని రెచ్చగొడుతూ ప్రజలను విచ్ఛిన్నం చేస్తుందని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు పశ్య పద్మ ఆరోపించారు. శుక్రవారం ప్రచార జాత వలిగొండకు చేరుకుంది. ఈ సందర్భంగా పద్మ మాట్లాడుతూ మతోన్మాద మెడలు వంచేది కమ్యూనిస్టులేనన్నారు. ప్రజల హక్కులు, సమస్యల పరిష్కారానికి అనేక పోరాటాలు చేసిన చరిత్ర సీపీఐదేనన్నారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు లలీ ఉల్లా ఖాద్రి, రాష్ట్ర రైతు సంఘం ఉప కార్యదర్శి బిజి నరేంద్రప్రసాద్, జిల్లా కార్యదర్శి యానాల దామోదర్‌రెడ్డి, రాష్ట్ర సమితిసభ్యులు గోదా శ్రీరాములు, జిల్లా సహాయ కార్యదర్శి బోలగోని సత్యానారాయణ, జిల్లా కార్యవర్గసభ్యులు బోడ సుదర్శన్, ఏశాల అశోక్, ఎండీ ఇమ్రాన్, సీపీఐ మండల కార్యదర్శి సలిగంజి వీరస్వామి, సీపీఎం మండల కార్యదర్శి సిర్పంగి స్వామి, యాదగిరి పాల్గొన్నారు.



అనంతగిరి మండలం శాంతినగర్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం

గుండాల: సీపీఐ ప్రచార కళాజాతా శుక్రవారం గుండాల మండల కేంద్రానికి చేరింది. ఈ సందర్భంగా పశ్య పద్మ, ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వలి ఉల్లా ఖాద్రీ, రాష్ట్ర రైతు సంఘం కోశాధికారి డిజి నరేంద్రప్రసాద్‌లకు కళాజాతాకు స్వాగతం పలికారు. సీపీఐ మండల కార్యదర్శి అనంతుల రామచంద్రయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యుడు కుసుమని హరిశ్చంద్ర, చేడె చంద్రయ్య, సత్యనారాయణ పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేక పాలన సాగిస్తున్న ప్రభుత్వాలు

మోత్కూరు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజావ్యతిరేక పాలన సాగిస్తున్నాయని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు పశ్య పద్మ విమర్శించారు. బస్సు జాత శుక్రవారం మోత్కూరు చేరుకున్న సందర్భంగా ఆమె ప్రజలనుద్దేశించి మాట్లాడారు. పేదలకు ఉండటానికి ఇల్లు, కడుపునిండా తినడానికి ఉపాధి కల్పించాల్సిన బాధ్యత పాలకులదేనన్నారు. కార్యక్రమంలో ప్రజానాట్యమండలి రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉప్పలయ్య, చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాశికంటి లక్ష్మీనర్సయ్య, సీపీఐ మండల కార్యదర్శి అన్నెపు వెంకట్, నాయకులు చాపల అంజయ్య, శ్రీనివాస్, పుల్కరం మల్లేష్ పాల్గొన్నారు.

భూమి, భుక్తి, వెట్టిచాకిరీ విముక్తికోసం

భువనగిరి గంజ్: భూమి, భుక్తి, వెట్టిచాకిరి విముక్తి కోసం పోరాడిన పార్టీ సీపీఐ అని పశ్య పద్మ అన్నారు. సీపీఐ ప్రచార కళాజాత జిల్లాకేంద్రానికి గురువారం రాత్రి చేరింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నాటి సాయుధ పోరాటమే అనేక ఉద్యమాలకు నెలవైందన్నారు. కొల్లూరి రాజయ్య, ఏశాల అశోక్, కార్యదర్శి దాసరి లక్ష్మయ్య, కళ్లెం కృష్ణ పాల్గొన్నారు.

ఆత్మకూరు(ఎం): పీడిత జనానికి కమ్యూనిస్టులు అండగా ఉన్నారని పశ్య పద్మ అన్నారు. ఆత్మకూరు(ఎం)లో ఆమె మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న మతోన్మాద బిజేపీ, తోపాటు ఆర్ఎస్ఎస్‌లు మత రాజకీయాలను రెచ్చగొట్టి దేశాన్ని విభజించేందుకు కుట్ర చేస్తున్నాయని ఆరోపించారు. కార్యక్రమంలో పాశికంటి లక్ష్మీనర్సయ్య, కుసుమని హరిశ్చంద్ర, ఉప్పల ముత్యాలు, ఎండీ ఇమ్రాన్, మండల కార్యదర్శి మారుపాక వెంకటేశం, మహేష్, నయీమ్ పాల్గొన్నారు.

యాదగిరిగుట్ట రూరల్: దోపిడీ పీడనలు లేని సమసమాజ స్థాపనే సీపీఐ లక్ష్యమని పశ్య పద్మ అన్నారు. యాదగిరిగుట్టలో ఏర్పాటు చేసిన సభలో ఆమె మాట్లాడుతూ వంద సంవత్సరాల నుంచి సీపీఐ పేదల పక్షాన అనేక పోరాటాలు నిర్వహించిన త్యాగాల పార్టీయని, ఈ ప్రాంతంలో వేలాది ఎకరాలు భూమిని పంచిన చరిత్ర సీపీఐకి దక్కిందన్నారు. కార్యక్రమంలో కళ్లెం కృష్ణ, బండి జంగమ్మ, పేరబోయిన మహేందర్, గోరెటి రాములు, పట్టణ కార్యదర్శి శ్రీధర్, పెంటయ్య పాల్గొన్నారు.

వ్యవసాయ కళాశాలలో అడ్మిషన్లు

● 29మంది విద్యార్థులకు అనుమతి ● మొదటి సెమ్ వరకూ రాజేంద్రనగర్ యూనివర్సిటీలోనే తరగతులు

సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో అడ్మిషన్లు ప్రారంభమయ్యాయి. మొదటి సంవత్సరం 30 మంది విద్యార్థులకు అడ్మిషన్లు ఇవ్వగా, రానురాను వాటి సంఖ్యను పెంచే అవకాశాలు ఉన్నాయి. 41మంది ప్రొఫెసర్లతోపాటు మొత్తం 200 మంది ఉద్యోగులతో కళాశాలను నిర్వహించనున్నారు. మొదటి సెమిస్టర్ వరకు రాజేంద్రనగర్‌లోని జయశంకర్ వ్యవసాయ విశ్వ విద్యాలయంలో తరగతులు కొనసాగుతాయి.

(ఆంధ్రజ్యోతి-హుజూర్‌నగర్)



విద్యార్థికి అడ్మిషన్ ఇస్తున్న యూనివర్సిటీ వైస్‌ఛాన్స్‌లర్ జానయ్య

హుజూర్‌నగర్‌కు ప్రభుత్వం ఇటీవల నూతనంగా మంజూరు చేసిన వ్యవసాయ కళాశాల తరగతులు రెండురోజుల్లో ప్రారంభం కానున్నాయి. కాగా రాజేంద్రనగర్‌లోని జయశంకర్ వ్యవసాయ యూనివర్సిటీలో ఈ నెల 17, 18, 19 తేదీల్లో కౌన్సెలింగ్ నిర్వహించారు. కాగా హుజూర్‌నగర్‌కు మొదటి సంవత్సరం 30 మంది విద్యార్థులకు అడ్మిషన్లు మంజూరుచేయగా కౌన్సెలింగ్‌లో 29మంది విద్యార్థులకు అడ్మిషన్లు కేటాయించారు. మరో విద్యార్థికి త్వరలోనే అడ్మిషన్ కల్పించనున్నారు. కాగా ఈ కౌన్సెలింగ్‌లో 14 మంది విద్యార్థులు, 15 మంది విద్యార్థినులకు అడ్మిషన్లు మంజూరు చేశారు. హుజూర్‌నగర్ వ్యవసాయ కళాశాలకు సంబంధించి మొత్తం 120 మంది విద్యార్థులు చదువుకునేలా సన్నాహాలు చేశారు. 41మంది ప్రొఫెసర్లతోపాటు మొత్తం 200 మంది ఉద్యోగులతో కళాశాలలో నిర్వహణ చేపట్టనున్నారు. మొదటి సంవత్సరం 30మందికి అవకాశం కల్పించారు. హుజూర్‌నగర్‌కు మంజూరైన వ్యవసాయ కళాశాలకు సంబంధించి విద్యార్థులకు మొదటి సెమిస్టర్ వరకు రాజేంద్రనగర్‌లోని యూనివర్సిటీలోనే తరగతులు నిర్వహించనున్నారు. ఫిబ్రవరి చివరి వరకు యూనివర్సిటీలోని భవనంలోనే తరగతులు నిర్వహించి రెండో సెమ్ నాటికి హుజూర్‌నగర్‌లో తరగతులు నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. హుజూర్‌నగర్‌లో ప్రైవేట్ భవనంలో వ్యవసాయ కళాశాల ఏర్పాటుచేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రైవేట్ బిల్డింగ్ అందుబాటులో లేకపోవడంతో మొదటి సెమ్ వరకు రాజేంద్రనగర్‌లోనే తరగతులు నిర్వహించాలని యూనివర్సిటీ అధికారులు నిర్ణయించారు. ఇదిలా ఉండగా పట్టణంలో వ్యవసాయ కళాశాల నిర్మించేందుకు భూసేకరణ జరుగుతుంది. మున్సిపల్ పరిధిలోని మగ్దుమ్‌నగర్‌లో 1041 సర్వే నెంబర్‌లోని ప్రభుత్వ భూమి 200 ఎకరాల్లో భూసేకరణ ఫైనల్ దశకు చేరింది.

రెండు మూడు రోజుల్లో సర్వే పూర్తి

సన్న, చిన్నకారు రైతులు భూములు సాగు చేసుకుంటుండగా సర్వే ప్రక్రియ వేగవంతంగా చేస్తున్నారు. మరో రెండుమూడు రోజుల్లో సర్వే పూర్తిచేయనున్నట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. కాగా ప్రభుత్వం కళాశాల నిర్మాణానికి సంబంధించి రూ.124కోట్ల నిధులు మంజూరు చేసి ఆర్థిక శాఖ నుంచి అనుమతులు ఇచ్చింది. దీంతోపాటు ప్రభుత్వం కేటాయించిన పోస్టులను మంజూరుచేశారు. టీచింగ్, నాన్‌టీచింగ్ పోస్టులను మంజూరు చేశారు. కళాశాల భవన నిర్మాణం పూర్తయిన తర్వాత పూర్తిస్థాయి టీచింగ్, ఇతర పోస్టులను భర్తీ చేయనున్నట్లు అధికారులు తెలిపారు. యూనివర్సిటీ పరిధిలోని వివిధ కళాశాలల్లో ఉన్న ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లతో విద్యార్థులకు బోధన చేయనున్నారు. హుజూర్‌నగర్ ప్రాంతంలో నూతనంగా ఏర్పాటుచేయనున్న వ్యవసాయ కళాశాల భూసేకరణ పూర్తి తర్వాత పనులు ప్రారంభించనున్నారు. వానాకాలం సీజన్ పూర్తయిన నేపథ్యంలో సేకరించిన భూమిలో పనులు ప్రారంభించేందుకు యూనివర్సిటీ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.

మొదటి సెమిస్టర్ వరకు..



హుజూర్‌నగర్ వ్యవసాయ కళాశాలకు సంబంధించి 30మంది విద్యార్థులకు అడ్మిషన్లు కల్పించాం. మొదటి సెమిస్టర్ వరకు యూనివర్సిటీలోని విద్యార్థులకు బోధన చేయనున్నాం. మొత్తం రూ.124కోట్లతో హుజూర్‌నగర్ వ్యవసాయ కళాశాల ఏర్పాటు చేయబోతున్నాం. కౌన్సెలింగ్ ప్రక్రియ పూర్తి చేసి అడ్మిషన్లు ఇచ్చాం. ఎల్లుండి నుంచే విద్యార్థులకు తరగతులు ప్రారంభించనున్నాం. 41 మంది ప్రొఫెసర్లతోపాటు మొత్తం 200 మందితో వ్యవసాయ కళాశాల కొనసాగుతుంది.

అల్దాసు జానయ్య, వైస్‌ఛాన్స్‌లర్

ముదిరాజ్‌లను బీసీ-ఏలోకి మార్చాలి

హాలియా, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌లో ముదిరాజ్‌లకు ఇచ్చిన అభయహస్తం హామీలను వెంటనే అమలుచేయాలని ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పిడిగం నాగయ్య డిమాండ్‌చేశారు. శుక్రవారం హాలియాలో ప్రపంచ మత్స్యకారుల దినోత్సవం సందర్భంగా తెలంగాణ ముదిరాజ్ మహాసభ ఆవిర్భావ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జెండావిష్కరణ చేసి అనంతరం మాట్లాడుతూ అభయహస్తం పేరుతో ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలన్నారు. ముదిరాజ్‌లను బీసీ-డీ నుంచి బీసీ-ఏలోకి మార్చాలన్నారు. ముదిరాజ్ కార్పొరేషన్‌కి రూ.వెయ్యి కోట్లు కేటాయించాలన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ అధ్యక్షుడు నాశబోయిన వెంకటేశ్వర్లు, పట్టణ అధ్యక్షుడు పుట్ట దుర్గారావు, ఎలకాని వెంకటేశ్వర్లు, తూటిపల్లి లక్ష్మణ్, తూటిపల్లి ఏడుకొండలు, దుగ్యాల రాములు, లింగంపల్లి శ్రీను, భద్రయ్య పాల్గొన్నారు.

CLASSIFIEDS

సర్టిఫికేట్ పోయినది

★ రమావత్ మూన తండ్రి సక్రు, గ్రామం అంగడిపేట, మండలం పి.ఏ.పల్లి, నల్లగొండ జిల్లా నాయొక్క PGDBA (పోస్టు గ్రాడ్యుయేషన్ ఇన్ డిప్లొమా ఇన్ బ్యాంకింగ్ ఫైనాన్స్) సర్టిఫికేట్, కన్సలిడేంట్ మెమో మరియు ప్రొవిజనల్ మెమో నెం. 21725580069 నెంబర్ గలది ఇల్లు శుభ్రంచేస్తుండగా పోయినది. దొరికిన వారు సంప్రదించగలరు సెల్: 7989196380

AJY_6838

NAME CHANGE

★ I, HAFEEZ MOHMAD ABDUL, S/o. WAHEED, (Old Name) R/o. Islampura, Miryalaguda municipality, Nalgonda District., Have changed my name as MOHAMMAD ABDUL HAFEEZ, S/o. WAHEED, (New Name). For all purposes.

AJY_AJY_6839

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

4 Lines CLASSIFIED
NLG+SRPT+YGT (3Dist)
210/- Only
Extra Line 45/- Only
For Ads Contact :
NALGONDA DIST
9985413656
9985413365
SURYAPET DIST
9703618713,
9985401015
YADADRI BHONGIRI DIST
8885995946

కాల్వలు ఇలా.. నీరు పారేదెలా?

» అధ్వానంగా మైనర్ కాల్వ » కంప చెట్లతో నిండిన ఏఎమ్మార్పీ డీ-25 6ఎల్ కాల్వ


కాల్వలో అడ్డంగా పడిపోయిన తాటిమొద్దు

కనగల్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): కనగల్ మండలంలోని ఏఎమ్మార్పీ డీ-25 6ఎల్ మైనర్ కాల్వ నిర్వహణ లోపంతో అస్తవ్యస్తంగా మారింది. కాల్వ పొడవునా కంపచెట్లు, పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగాయి. కాల్వలో చెట్ల మొద్దులు, చెత్తాచెదారం నిండి నీటి ప్రవాహానికి అడ్డు తగులుతున్నాయి. దీంతో కాల్వ చివరి వరకు నీటి ప్రవాహం కొనసాగటం లేదు. 6ఎల్ మైనర్ కాల్వ సుమారు 11 కిలోమీటర్ల పొడవు ఉంది. దీని కింద 5200 ఎకరాల విస్తీర్ణంలో ఆయకట్టు ఉంది. అంతేకాక ఈ కాల్వ ద్వారా చిన్నవి, పెద్దవి కలిపి మొత్తం నాలుగు చెరువులకు నీరు విడుదల చేస్తారు. ఏళ్ల తరబడి కాల్వ మరమ్మతులకు నోచుకోకపోవడంతో చివరి భూములకు సాగు నీరందటం గగనంగా మారింది. మరో నెల రోజుల్లో పంట సీజన్ ప్రారంభం కానున్న నేపథ్యంలో సాగు నీటి విడుదలకు ముందే కాల్వలో పెరిగిన కంపచెట్లు, గుర్రపు డెక్క మొక్కలను తొలగించి మరమ్మతు పనులు చేపట్టాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

కాల్వకు లైనింగ్ మరమ్మతు పనులు చేపట్టాలి



ఏఎమ్మార్పీ మైనర్‌కాల్వకు పలు చోట్ల గండ్లు పడి ప్రతి సీజన్‌లో సాగునీరు వృథా అవుతుంది. ఏళ్ల తరబడి కాల్వ మరమ్మతు పనులకు నోచుకోలేదు. గుర్రపు డెక్క, కంపచెట్లు ఏపుగా పెరిగాయి. కంపచెట్లను తొలగించి కాల్వకు లైనింగ్ మరమ్మతులు చేపట్టాలి.
- పగిడి సైదులు, రైతు, బుడమర్లపల్లి

కంప చెట్లను తొలగిస్తాం

ఏఎమ్మార్పీ 6ఎల్ మైనర్ కాల్వలో పెరిగిన కంపచెట్ల తొలగింపు పనులను చేపడతాం. ఇందుకు సంబంధించి నిధుల మంజూరు కోసం ప్రతిపాదనలు పంపాం. రైతులు కాల్వగట్లకు గాతులు పెట్టొద్దు. కాల్వ దారులను ఆక్రమిస్తే చర్యలు తీసుకుంటాం.
- ప్రియాంక, ఐబీ ఏఈ

అదనపు గది పూర్తయ్యేదెప్పుడో?

» ఎల్లారెడ్డిగూడెం జడ్పీహెచ్ఎస్‌లో అసంపూర్తి గది » పూర్తిచేస్తే ల్యాబ్, లైబ్రరీగా ఉపయోగం » సరిపోని సీడీపీ నిధులు


అసంపూర్తిగా మిగిలిన అదనపు తరగతి గది,తరగతి గది కోసం వేసిన శంకుస్థాపన శిలాఫలకం

నార్కట్‌పల్లి, నవంబరు 21, (ఆంధ్రజ్యోతి): నార్కట్‌పల్లి మండలంలోని ఎల్లారెడ్డిగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఓ తరగతి గది నిర్మాణం అసంపూర్తిగా మిగిలింది. పాఠశాలలో ఉన్న పాత తరగతి గదులు క్రమంగా శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. దీంతో గదుల కొరత ఏర్పడగా ఉపాధ్యాయులు, గ్రామస్థులు ఈ సమస్యను అప్పటి ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. దీంతో సీడీపీ కింద అదనపు తరగతి గదిని 2022లో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వంలో మంజూరు చేశారు. సుమారు రూ.10లక్షల అంచనా వ్యయంతో చేపట్టిన ఈ భవనం మూడేళ్లయినా అసంపూర్తిగానే మిగిలింది. భవన నిర్మాణానికి మంజూరైన నిధులు సరిపోకపోగా కనీసం చేసిన పనులకైనా ప్రభుత్వం నుంచి బిల్లులు రాకపోవడంతో ఈ భవన నిర్మాణ పనులు చేపట్టిన కాంట్రాక్టర్ మధ్యలోనే పనులను ఆపేశాడు. దీంతో ఈ అసంపూర్తిగా మిగిలిన ఈ భవనం నిరర్థకంగా మారింది.

ల్యాబ్..లైబ్రరీగా వాడాలనుకున్నాం



అదనపు తరగతి గది నిర్మాణం పూర్తయితే ఇందులో పదవ తరగతి విద్యార్థులకు ల్యాబ్‌గాను మరికొంత స్థలాన్ని లైబ్రరీగా వాడుకోవాలని భావించాం. కానీ భవన నిర్మాణ పనులు చేపట్టిన కాంట్రాక్టర్ పూర్తిచేసేందుకు బిల్లులు రావడం లేదని చెబుతున్నారు. ప్రస్తుతం ఇరుకైన గదుల్లోనే ఈ రెండింటినీ నిర్వహిస్తున్నాం. నిర్మాణంలో ఉన్న తరగతి పూర్తయితే సౌకర్యంగా ఉంటుంది.
- హిమజ, ప్రధానోపాధ్యాయురాలు

మండల పరిషత్ అభివృద్ధి నిధుల కింద చేర్చాం



ఎల్లారెడ్డిగూడెం జడ్పీహెచ్ఎస్‌లో అసంపూర్తిగా మిగిలిన అదనపు తరగతి గది నిర్మాణం పూర్తి కోసం సీడీపీ నిధులు సరిపోలేదు. దీంతో 15వ ఆర్థిక సంఘం ద్వారా మండల పరిషత్‌కు వచ్చే నిధుల కింద మరో రూ.4లక్షలు ప్రతిపాదనలు పెట్టాం.గోడలకు ప్లాస్టరింగ్, ఫ్లోరింగ్, పెయింటింగ్ పనులు మిగిలిపోయాయి. నిధులు మంజూరు కాగానే పనులు ప్రారంభిస్తాం.
- భరత్‌చంద్ర, పీఆర్ ఏఈ

పంపిణీకి జింకు బస్తాలు సిద్ధం

కనగల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): కనగల్ పీఏసీఎస్‌లో పంపిణీకి జింకు బస్తాలు సిద్ధంగా ఉన్నాయని ఏవో అమరేందర్‌గౌడ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పది కేజీలు ఉన్న ఒక్కో బస్తా రూ.5 వందలకు లభిస్తుందన్నారు. అవసరం ఉన్న రైతులు తమ పట్టాదారు పాస్‌బుక్, ఆధార్‌కార్డు జీరాక్స్‌లతో పీఏసీఎస్ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

తపస్ మండల అధ్యక్షుడిగా మురళి

మునుగోడు, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం(టీపీయూఎస్) తపస్ మండల అధ్యక్షుడిగా మిర్యాల మురళి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జిల్లా కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన సంఘ సమావేశంలో మునుగోడు మండల కమిటీని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా మిర్యాల మురళి, ప్రధాన కార్యదర్శిగా పిండి వెంకట్‌రెడ్డిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ ఎన్నికకు సహకరించిన సంఘం నేతలు, ఉపాధ్యాయ సహచరులకు కృతజ్ఞతలు తెలిపారు. ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం, సంఘం బలోపేతానికి శక్తివంచన లేకుండా పనిచేస్తామని హామీ ఇచ్చారు.

శ్రీశాంభవీదేవీకి భక్తుల పూజలు


శాంభవీదేవీ అమ్మవారు

చిట్యాలరూరల్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): మార్గశిరమాస ఆరంభం మొదటిరోజు శుక్రవారాన్ని పురస్కరించుకుని చిట్యాల మండలం నేరడలోని శ్రీమహమ్మాయి శాంభవీదేవీ ఆలయంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీ మహమ్మాయి శాంభవీదేవీ ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలను, అభిషేకాలను నిర్వహించారు. అమ్మవారికి వరంగల్‌కు చెందిన శ్రీశాంభవి మహిళా సంక్షేమ మండలి సభ్యులు అభిషేక కార్యక్రమాలను నిర్వహించి పూజలో పాల్గొన్నారు. వేకువజాము నుండే భక్తులు ఆలయానికి చేరుకుని అమ్మవారిని దర్శించుకున్నారు. పురోహితులు అమ్మవారికి పూజా కార్యక్రమాలను అభిషేకాల అనంతరం పూజలు నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయానికి భక్తులు తరలివచ్చి భక్తిశ్రద్ధలతో అమ్మవారి దర్శించుకోవడంతో ఆలయాల్లో ఆధ్యాత్మికశోభ సంతరించుకుంది.

జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలి


కలెక్టరేట్ ఏవోకు వినతిపత్రం అందజేస్తున్న జర్నలిస్టు సంఘం నాయకులు

నల్లగొండ (కలెక్టరేట్), నవంబరు 21(ఆంధ్రజ్యోతి): జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు ఎండీ అయూబ్ అన్నారు. సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టరేట్ కార్యాలయం ముందు నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం కార్యాలయంలోని పరిపాలన అధికారి మోతీలాల్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అయూబ్ మాట్లాడుతూ రాష్ట్రంలో మూడేళ్లుగా అక్రిడేషన్ కార్డులు ఇవ్వకపోగా దానిని రెన్యువల్ చేసుకుంటూ పోతున్నారన్నారు. ప్రభుత్వం తక్షణమే కొత్త అక్రిడేషన్ కార్డు జారీ చేసే విధంగా విధివిధానాలు ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర నాయకులు సాదత్ అలీ, వరుణ, జిల్లా నాయకులు పుష్పలత, ఖాజా నాజీముద్దీన్, నరేందర్‌రెడ్డి, నాగయ్య, రామకృష్ణ, బాలరాజు, సైదులు, హరికృష్ణ, జర్నలిస్టులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలను మెరుగుపరచాలి

మర్రిగూడ, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): పాఠశాల విద్యార్థులలో కనీస అభ్యసన సామర్థ్యాలను మెరుగుపరిచే విధంగా ఉపాధ్యాయులు బోధనలు చేయాలని ఎంఈవో బిట్టు శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం మండలంలోని శివన్నగూడ జడ్పీ హైస్కూల్ కాంప్లెక్స్ సముదాయ సమావేశంలో భాగంగా, వృత్త్యంతర శిక్షణ కార్యక్రమాన్ని మండల రీసోర్స్‌పర్సన్ ఉదావత్ లచ్చిరాంనాయక్ వివిధ అంశాలపై ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రూప్‌సింగ్, రజినీకాంత్, నాగయ్య, వెంకట్‌కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గీత కార్మికుడికి ఆర్థిక సాయం అందజేత

కట్టంగూరు, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని నారెగూడెం గ్రామానికి చెందిన కల్లుగీత కార్మికుడు ఆకుల ఎల్లయ్యకు కౌండిన్య అసోసియేషన్ ఆఫ్ నార్త్ అమెరికా ప్రతినిధుల సహకారంతో శుక్రవారం తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం నాయకులు రూ.10వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో కౌండిన్య అసోసియేషన్ ఆఫ్ నార్త్ అమెరికా ప్రతినిధులు నాతి గణేష్, బాల్నే రామచంద్రుడు, బల్గూరి వెంకట్, తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి దండెంపల్లి శ్రీనివాస్, వేముల సైదులు, ఆకుల బక్కయ్య, దండెంపల్లి లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

పద్మశాలీల సమస్యలను పరిష్కరించాలి

నల్లగొండటౌన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): పద్మశాలీల సమస్యను పరిష్కరించాలని తెలంగాణ పద్మశాలీ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడిగా నల్ల శ్రీనివాస్ అన్నారు. తెలంగాణ పద్మశాలీ ఉద్యోగుల సంఘం నల్లగొండ, సూర్యాపేట ఉమ్మడి జిల్లా నూతన కార్యవర్గాన్ని గురువారం రాత్రి స్థానిక జిల్లా కార్యాలయంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా నల్ల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా యేశాల విశ్వకుమార్, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా చిలుకూరి వెంకటేశం, కోశాధికారి పున్న వేణుగోపాల్, ఉపాధ్యక్షులు మిర్యాల వేంకటపతి, రాపోలు రవి, ఆనందపు సత్యనారాయణ, బీమనపల్లి దుర్గయ్య, పొట్టబత్తుల జ్యోతి, మిర్యాల సుధాకర్, సభ్యులను ఎన్నుకున్నారు.

నేటి సాగర్ - శ్రీశైలం లాంచీ ప్రయాణం రద్దు

● పర్యాటకుల సంఖ్య తక్కువగా ఉండటంతో నిర్ణయం

నాగార్జునసాగర్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ పర్యాటక కేంద్రమైన నాగార్జునసాగర్ నుంచి శ్రీశైలంకు లాంచీ ప్రయాణాన్ని రద్దుచేసినట్లు పర్యాటక శాఖ అధికారులు తెలిపారు. నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్ హిల్‌కాలనీ నుంచి నంద్యాల జిల్లా శ్రీశైలానికి ఈ నెల 22వ తేదీ నుంచి ప్రతి శనివారం లాంచీలు నడపాలని పర్యాటక శాఖ నిర్ణయించింది. పర్యాటకులు తక్కువ సంఖ్యలో టికెట్లు బుక్ చేసుకోవడంతో ఈ నెల 22న(శనివారం) లాంచీ ప్రయాణాన్ని రద్దు చేసినట్లు పర్యాటక శాఖ అధికారులు తెలిపారు. 100మంది పర్యాటకులు బుక్ చేసుకుంటే సాగర్ - శ్రీశైలం లాంచీని నడుపుతామని పేర్కొన్నారు. పర్యాటకుల సంఖ్య మేరకు లాంచీలు నడుపుతామని పర్యాటక శాఖ అధికారులు తెలిపారు.

మత్స్యకార కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలి


కేతేపల్లిలో జెండా ఎగుర వేస్తున్న మత్స్య కార్మికులు

మర్రిగూడ, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఇళ్లు లేని మత్స్యకా ర కుటుంబాలకు ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని మత్స్యశాఖ అధ్యక్షుడు యాట యాదగిరి అన్నారు. మర్రిగూడ మండలంలోని ఖుదాభక్ష్‌పల్లి గ్రామంలో ప్రపంచ మత్స్యకార సంఘం దినోత్సవాన్ని పురస్కరించుకుని ముదిరాజ్ గుర్తుగా ఆ సంఘం జెండాను ఘనంగా ఎగురవేశారు. ఈ కార్యక్రమానికి గ్రామ ప్రజలు, మత్స్యకార సంఘాలకు చెందిన నాయకులు అధిక సంఖ్యలో హాజరై దినోత్సవాన్ని విజయవంతం చేశారు. ప్రభు త్వం మత్స్యకారుల అభివృద్ధికి మరింత చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం మాజీ ఎం పీటీసీ సిరగోని బలరాం, కార్యదర్శి పొట్టగిరి, ఉపాధ్యక్షుడు బట్టు రవి, డైరెక్టర్ కారింగు శ్రీశైలం, కారింగు కొండలు, సిరగోని వెంకటేష్, సొసైటీ సభ్యులు సిరగోని గణేష్, దాసరి శ్రీకాంత్, జిలగోని కిరణ్, పొట్ట నరసింహ, పొట్ట బుగ్గయ్య, సిరగోని రమేష్, బట్టు శివ, దొంతరగోని రాజు, కారింగు శీను పాల్గొన్నారు.

కేతేపల్లి: మండలంలోని వివిధ గ్రామాల్లో మత్స్యకార దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని భీమారం, కేతేపల్లి, కాసనగోడు, బొప్పారం, తుంగతుర్తి గ్రామాల్లో మత్స్యకార సంఘం జెండాలను ఎగుర వేసి సైకిల్, ద్విచక్ర వాహన ర్యాలీలు నిర్వహించారు. అనంతరం ఆయా గ్రామాలకు చెందిన మత్స్యకార సంఘం నాయకులు మాట్లాడారు. ముదిరాజ్‌లను బీసీ ఏలో చేర్చాలని ప్రభుత్వాన్ని కోరారు. ఇళ్లలేని మత్స్యకార కుటుంబాలకు ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలన్నారు. ఆయా కార్యక్రమాల్లో మత్స్యకార సంఘాల నాయకులు అమరోజు సైదులు, డి.నాగరాజు, జినకల సైదులు, నాగరాజు, ఎ.మధు, కోట్ల రాంబాబు, అమ్రోజు లింగయ్య, జిల్లల యాదగిరి, ఉత్తెర్ల నాగరాజు, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలను చైతన్యం చేయడమే ప్రజానాట్యమండలి లక్ష్యం


మహాసభ కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

మర్రిగూడ, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): జానపద సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా ప్రజలను చైతన్యం చేయడమే ప్రజానాట్యమండలి ఉద్దేశమని ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షుడు నాంపల్లి చంద్రమౌళి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో డిసెంబర్ 6,7వ తేదీల్లో జిల్లాలో జరిగే ప్రజానాట్యమండలి ఎనిమిదో మహాసభల సందర్భంగా వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ప్రజానాట్యమండలి మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో చింటు, నాగరాజు, ఏర్పుల ఎల్లయ్య, వంశీ, గణేష్, రమేష్, సిద్ధార్థ, అభినయ పలువురు ఉన్నారు.

కార్మిక చట్టాల పరిరక్షణకు పోరాడాలి


సమావేశంలో మాట్లాడుతున్న సలీం

శాలిగౌరారం, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): కార్మికుల సంక్షేమం కోరే, హక్కుల చట్టాల పరిరక్షణ కోసం అన్ని రంగాల కార్మికులు సమరశీల పోరాటాలు నిర్వహించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎండీ.సలీం పిలుపునిచ్చారు. శుక్రవారం శాలిగౌరారంలోని సీఐటీయూ కార్యాలయంలో మండల విస్తృత సమావేశంలో సలీమ్ మాట్లాడారు. కార్మికులకు మేలు చేసే చట్టాలను నిర్వీర్యం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్ర చేస్తోందని, అందు కు రాష్ట్ర ప్రభుత్వం వత్తాసు పలుకుతోందని అన్నారు. ఎనిమిది గంటల పని విధానాన్ని తొలగించి 10 గంటల పని విధానాన్ని అమలు చేస్తున్నారని ఆరోపించారు. కార్మిక చట్టాలు సక్రమంగా అమలు కాకుండా ప్రభుత్వాలు ప్రయత్నాలు చేస్తున్నాయని, అందులో భాగంగానే కార్మిక శాఖ అధికారులను తనిఖీలు చేయకుండా అడ్డుకుంటున్నారని విమర్శించారు. కార్మికులు పోరాడి సాధించుకున్న ప్రమాద బీమా లాంటి సంక్షేమ పథకాలు నిర్వీరమవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులు సంఘటితంగా ఉండి సంఘాలు ఏర్పాటు చేసుకొని హక్కుల సాధన కోసం చట్టాల పరిరక్షణ కోసం బలమైన పోరాటాలు చేయాలన్నారు. కార్మికుల సంక్షేమం కోసం సీఐటీయు అండగా ఉంటుందన్నారు. సీఐటీయు జిల్లా నాయకుడు లకపాక రాజు మాట్లాడుతూ సీఐటీయు జిల్లా మహాసభలను జయప్రదం చేయలని కోరారు. సమావేశంలో సీఐటీయూ మండల కన్వీనర్ గుండ్లపల్లి వెంకటయ్య, రైతు సంఘం నాయకులు చలకాని మల్లయ్య, సీఐటీయు మండల నాయకులు బల్లెం నవనీత, గుండ్ల సైదమ్మ, సోమలింగం, కల్లూరు రేణుక, ఎర్ర రాజు, ఎర్ర సోమలింగం, పనికిర ఎల్లయ్య, ప్రజా సంఘాల నాయకులు మక్క బుచ్చి రాములు, కల్లూరు లింగయ్య, యేశబోయిన అంజయ్య, తదితరులు పాల్గొన్నారు.

సైన్స్‌పై ఆసక్తి పెంచడానికే చెకుముకి పోటీలు


విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న జేవీవీ నాయకులు

చండూరు, నవంబరు21 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించడంతో పాటు సైన్స్‌పై ఆసక్తిని పెంచడానికే చెకుముకి సైన్స్ పోటీలు దోహదపడుతాయని మునిసిపల్ కమిషనర్ ఎల్.మల్లేశం, ఎంఈఓ సుధాకర్‌రెడ్డి, టీఆర్ ఫౌండేషన్ చైర్మన్ బొబ్బల టామ్‌రెడ్డి, జన విజ్ఞాన వేదిన రాష్ట్ర నాయకులు వద్దిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. చండూరు పట్టణ కేంద్రంలో శుక్రవారం ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన 36మంది విద్యార్థులకు మండల స్థాయిలో పోటీలు నిర్వహించగా 9మంది విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. వీరిని జిల్లా స్థాయి పోటీలో పాల్గొనేందుకు ఎంపిక చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. జిల్లా స్థాయికి ఎంపికైన విద్యార్థులకు టీఆర్ ఫౌండేషన్ చైర్మన్ బొబ్బల టామ్‌రెడ్డి జ్ఞాపికలు, బహుమతులు అందజేశారు. జేవీవీ మండల అధ్యక్షుడు రాపోలు ప్రభాకర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాలల టీచర్లు కోటేశ్వర్‌రెడ్డి, సరస్వతి, వెంకన్న, చంద్రశేఖర్, విజయలక్ష్మి, వీరేశం పాల్గొన్నారు.

నాంపల్లి: నాంపల్లి మండలస్థాయి చెక్‌ముఖి టాలెంట్ టెస్టు సంబరాలు జడ్పీ హైస్కూల్‌లో శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమానికి ఎంఈవో మల్లికార్జున్‌రావు హజరై మాట్లాడారు. అనంతరం పసునూరు, నాంపల్లి, గాంధీజీ హైస్కూల్, మోడల్‌స్కూల్‌లో విజేతలకు ఎంఈవో సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం అజయ్‌కుమార్, శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు సత్యనారాయణ, సీఆర్‌పీ కేశవులు, రవీందర్, ముత్యాలు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

చిట్యాల: జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన మండల స్థాయి చెకుముకి సైన్స్ సంబరాల్లో గెలుపొందిన విద్యార్థులకు ఎంఈవో సైదానాయక్ బహుమతులు అందజేశారు. నేరడ పాఠశాల ప్రథమ బహుమతి, ప్రైవేట్ పాఠశాలలో విభాగంలో కృష్ణవేణి టాలెంట్ స్కూల్ ప్రథమ బహుమతి సాధించినట్లు జేవీవీ కోఆర్డినేటర్ గోవర్ధన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎం సుశీల, జేవీవీ మండల కన్వీనర్ రంగా రామలింగయ్య పాల్గొన్నారు.

శ్మశానవాటిక నిర్మాణం కోసం తీర్మానం

● 316 సర్వే నెంబర్‌లోనే శ్మశాన వాటిక నిర్మాణం చేయాలి

మర్రిగూడ, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): శ్మశానవాటిక ఏర్పాటు కోసం గ్రామస్థులంతా శుక్రవారం తీర్మానం చేసి, ప్రతిని అధికారులకు అందజేశారు. 'శ్మశానవాటిక ఏ ర్పాటుకు అడ్డంకులు, అభ్యంతరాలు' అనే వార్త శుక్రవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితం కాగా అధికారులు స్పందించారు. మండలంలోని రాజపేట తండా గ్రామపంచాయతీ పరిధిలో శ్మశానవాటిక నిర్మాణం దేవుళ్ల విగ్రహాల పేర్లతో కొంతమంది రైతులు, ప్రజలు, పనులను అడ్డుకుని నిలిపివేసిన ఘటన విదితమే. శుక్రవారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఎంపీడీవో మున్నయ్య, గ్రామ ప్రజల, మాజీ ప్రజాప్రతినిధుల సమక్షంలో గ్రామసభను నిర్వహించారు. గ్రామ ప్రజలు, మాజీ ప్రజాప్రతినిధుల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. గతంలో రెవెన్యూ, మండల అభివృద్ధి అధికారులు శ్మశాన దహన వాటిక ఏర్పాటు కోసం సర్వేనెంబర్ 316లో ప్రభుత్వ భూమిలో సర్వే చేసిన 10గుంటల భూమిని సిద్ధం చేశారని, ఆ సర్వే నెంబర్ భూమిలోనే శ్మశాన దహన వాటికను ఏర్పాటు చేయాలని గ్రామ ప్రజలు ఏకగ్రీవంగా తీర్మానం చేసి పత్రాన్ని ఎంపీడీవోకు అందజేశారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి మౌనిక, భీమా నాయక్, జయ ప్రసాద్, వెంకట్రాం, వెంకటేష్, వెంకటయ్య, జేపీ, వెంకటరెడ్డి, మాదగోని రాములు, నరసింహ, మహేష్, పందుల మైసయ్య, పందుల యాదయ్య, శ్రీరాములు, పాషా, బాబా, రామచంద్రం ఉన్నారు.

కాటమయ్య రక్షణ కిట్లు ఇవ్వాలి

మునుగోడు, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం కల్లుగీత కార్మికులందరికీ కాటమయ్య రక్షణ కవచం కిట్లను వెంటనే ఇవ్వాలని కల్లుగీత కార్మిక సంఘం మండల కార్యదర్శి వేముల లింగస్వామి డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో జరిగిన కల్లుగీత కార్మికుల సంఘ సమావేశంలో ఈ నెల 28వ తేదీన నిర్వహించతలపెట్టిన రణభేరి పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న ఎక్స్‌గ్రేషియా డబ్బులను గీత కార్మికులకు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. అర్హులైన కార్మిక కుటుంబాలకు పింఛన్ వర్తింపజేసి ఆదుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పీఎస్ఎం జిల్లా అధ్యక్షుడు నాంపల్లి చంద్రమౌళి, నాయకులు ముత్యాలు, అయితగోని మల్లేష్, చంద్రమౌళి, అంజయ్య, వెంకన్న, బిక్షం, సైదులు, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి నిరంతర పోరాటం

● టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు మురళి


సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న సంఘం నాయకులు

నల్లగొండ, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం యూనియన్ నిరంతరం పోరాటం నిర్వహిస్తుందని టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు నాగిళ్ల మురళి అన్నారు. శుక్రవారం యూనియన్ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 80 సంవత్సరాల చరిత్ర కలిగిన సంఘంలో సభ్యత్వం తీసుకోవాలని కోరారు. 11 యూనిట్స్, 54 ఫోరం కలిగిన అతిపెద్ద సంఘంగా గుర్తింపు పొందిన యూనియన్ ఉద్యోగుల జెఏసీకి నాయకత్వం వహిస్తుందన్నారు. అనంతరం వ్యవసాయశాఖ, మెడికల్ కాలేజీ, నీటిపారుదల శాఖలలో సభ్యత్వ నమోదు చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి శేఖర్‌రెడ్డి, అర్బన్ యూనిట్ అధ్యక్షుడు లక్ష్మయ్య, నర్సింహాచారి, వెంకట్‌రెడ్డి, వెంకటరమణ, భాస్కర్, రాణదేవ్, శ్రీనివాస్, సత్యనారాయణ, ఆంజనేయులు, వెంకటపతి, సైదులు నాయక్, శ్రీనివాస్‌రావు, మహేష్, వరప్రసాద్, యూనిస్, నందు, ముబీన్ తదితరులు పాల్గొన్నారు.

డాక్యుమెంట్ల


డిజిటలైజేషన్ అసంపూర్ణం

(5వ పేజీ తరువాయి)

అది అసంపూర్తిగా మిగిలింది. గత ప్రభుత్వ ఆదేశాల మేరకు డాక్యుమెంట్లను రిజిస్ట్రేషన్ చేసినా, 60 నుంచి 70 శాతానికి మించలేదు. మరో 30శాతం డాక్యుమెంట్లను నిర్లక్ష్యంగా వదిలేశారు. ఆయా డాక్యుమెంట్లకు సంబంధించిన ప్రతీ కాగితాన్ని డిజిటలైజేషన్ చేయాల్సి ఉండగా, కొన్ని చిరిగిపోవడం, కొన్నింటిలో అక్షరాలు కనపడకపోవడంతో వాటిని పక్కన పెట్టినట్టు తెలిసింది. అంతేగాక డిజిటలైజేషన్ ప్రక్రియకు సంబంధించి బిల్లులు సకాలంలో చెల్లించకపోవడంతో ఈ ప్రక్రియ మధ్యలోనే నిలిచినట్టు తెలిసింది. ప్రధానంగా ఉర్దూ డాక్యుమెంట్ల డిజిటలైజేషన్ సమయంలో ఆ భాషా అర్థం చేసుకోవడంకోసం, ఎంతో అనుభవం ఉన్న వ్యక్తులను అందుబాటులో ఉంచుకొని ఈ ప్రక్రియ చేపట్టాల్సి ఉండగా, మొక్కుబడిగా చేపట్టినట్లు తెలిసింది. అదేవిధంగా డిజిటలైజేషన్ చేపట్టామని అధికారులు చెబుతున్నా, వాటికి సంబంధించిన నకలు కాపీల నిమిత్తం ఎవరైనా దరఖాస్తు చేస్తే ఆన్‌లైన్‌లో లేకపోవడంతో సమస్య ఎదురవుతోంది. పాత డాక్యుమెంట్లకు సంబంధించిన ఈసీలు, సీసీలు, ఇతర వివరాలు ఆన్‌లైన్‌లో లభించడం లేదు. ఉర్దూ, ఇంగ్లీష్‌లో ఉన్న డాక్యుమెంట్లు పాతబడి చదవలేని స్థాయిలో ఉన్నప్పుడు వాటిని జాగ్రత్తగా జీరాక్స్ తీయడంతో పాటు ఆధునిక యంత్రాల ద్వారా పాత డాక్యుమెంట్ వివరాలు ఉండేలా చూసి డిజిటలైజేషన్ చేస్తేనే ఆరు దశాబ్దాల కాలం నాటి ఈ దస్తావేజులు అందుబాటులో వస్తాయి. వాస్తవానికి ప్రతీ ఆస్తి కొనుగోలు అనంతరం రిజిస్ట్రేషన్ పూర్తయ్యాక ప్రస్తుతం వెంటనే ఆన్‌లైన్‌లో పొందుపరుస్తున్నారు. అయితే ఆరు దశాబ్దాల కాలం నాటి డాక్యుమెంట్లకు మాత్రం సరైన భద్రత కరువైంది. ఇప్పటికైనా పూర్తిస్థాయిలో స్టాంపులు, రిజిస్ట్రేషన్‌శాఖ అధికారులు డాక్యుమెంట్లను భద్రపరచాలని ఆస్తుల క్రయ, విక్రయదారులు కోరుతున్నారు.

ఆంధ్రజ్యోతి సదా మీ సేవలో..
'ఆంధ్రజ్యోతి'కి చందాదారులుగా చేరాలనుకుంటున్నారా! పత్రిక పంపిణీలో ఏమైనా అసౌకర్యం ఎదురైందా! మాకు సమాచారమివ్వండి.. మా సిబ్బంది సదా మీ సేవకు సిద్ధంగా ఉంటారు. ACM - 9985411394
Nalgonda ACO - 9985410334, Nalgonda-1 ACO-9985 411407, Chandur SR - 9849337588, Chityala SR - 9010198664, Nakrekal SR - 9963624250, ,Kattangoor SR - 9963624250

ఆంధ్రజ్యోతి
గరిష్ఠం 26.5
కనిష్ఠం 15.4
ANDHRAJYOTHY
నల్లగొండ
5
శనివారం 22 నవంబరు 2025





లక్ష్మీనృసింహుడికి సువర్ణ పుష్పార్చన 7

సహృదయం పరిమళించిన వేళ..
• అనాథ వయోవృద్ధులకు అండగా ముస్లిం దంపతులు

డాక్యుమెంట్ల డిజిటలైజేషన్ అసంపూర్ణం



స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖలో పాత డాక్యుమెంట్ల పరిస్థితి దయనీయంగా మారింది. ప్రభుత్వానికి కోట్ల రూపాయల ఆదాయాన్ని ఇస్తున్నా రిజిస్ట్రేషన్ల శాఖకు ఉమ్మడి జిల్లాలో సొంత భవనాలు లేవు. కనీస వసతులు లేని అద్దె భవనాల్లో డాక్యుమెంట్లు ఉంచడంతో వర్షం వస్తే తడుసున్నాయి. డాక్యుమెంట్ల డిజిటలైజేషన్ నేటికీ పూర్తికాలేదు.

- (ఆంధ్రజ్యోతి,నల్లగొండ)

» 60ఏళ్లు పైబడిన దస్తావేజులకు భద్రత కరువు » కోట్ల రూపాయల విలువైన ఆస్తుల పత్రాలపై నిర్లక్ష్యం » ఆన్‌లైన్‌లో కనిపించని పాత డాక్యుమెంట్లు

జిల్లా కేంద్రంలోని రిజిస్ట్రేషన్ కార్యాలయంలో కోట్లాది రూపాయల విలువైన ఆస్తుల క్రయ విక్రయాలకు సంబంధించిన దస్తావేజులు 60ఏళ్లకు పైబడినవి స్టోర్ రూమ్‌లో రక్షణలేక మూలుగుతున్నాయి. జిల్లాలోని పలు కార్యాలయాల్లో సైతం ఇదే పరిస్థితి నెలకొంది. నకిరేకల్, మోత్కూరు, కోదాడ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు ఉమ్మడి రాష్ట్రంలో ప్రభుత్వం సొంత భవనాలు నిర్మించగా, తెలంగాణ ఏర్పాటు అనంతరం ప్రభుత్వం ఆ భవనాలను ప్రారంభించింది. ఆ తరువాత రిజిస్ట్రేషన్ల శాఖకు గత ప్రభుత్వ హయాంలో ఒక్క భవనం కూడా నిర్మించకపోగా, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఈ రెండేళ్లలోనూ భవన నిర్మాణాలు చేపట్టలేదు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 15 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉండగా, మూడు కార్యాలయాలకు మాత్రమే సొంత భవనాలు ఉన్నాయి. మిగతా 12 సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలు అద్దె భవనాల్లోనే అరకొర వసతుల నడుమ కొనసాగుతున్నాయి. కనీసం సిబ్బందికి, ఆస్తుల క్రయవిక్రయదారులకు కూడా మౌలిక ఇక్కడ వసతులు కరువయ్యాయి. 60ఏళ్లకు పైగా పాత డాక్యుమెంట్లలో ఉర్దూ, ఇంగ్లీష్ ఉన్నవి అనేకం ఉన్నాయి. వాటికి భద్రత కరువైంది. ఆయా భాషలకు అనుగుణంగా నిష్ణాతులైన వారి ద్వారా డాక్యుమెంట్లను ఆన్‌లైన్‌లో పొందుపర్చాల్సి ఉండగా, శాఖ అధికారులు ఆవైపుగా దృష్టి సారించకపోవడంతో గతంలో జరిగిన డిజటలైజేషన్ డాక్యుమెంట్లపై అపోహలు నెలకొన్నాయి.

నిర్లక్ష్యంతోనే దెబ్బతింటున్న డాక్యుమెంట్లు...

రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతి ఆర్థిక సంవత్సరంలో ఉమ్మడి నల్లగొండ జిల్లా నుంచి స్టాంపులు, రిజిస్ట్రేషన్‌శాఖ ద్వారా రూ.300కోట్ల నుంచి రూ.350కోట్ల వరకు ఆదాయం సమకూరుతోంది. అయినా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఏ మాత్రం వసతులు లేక ప్రతీ రోజు కార్యాలయానికి వచ్చే ఆస్తుల క్రయవిక్రయదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వారితోపాటు అధికారులు, ఉద్యోగులు సైతం ఇబ్బందులుపడుతన్నారు. జిల్లా కేంద్రంలో మునిసిపల్ కాంప్లెక్స్‌లో కొనసాగుతున్న డీఆర్ కార్యాలయం పక్కనే నల్లగొండ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం సైతం అద్దె భవనంలోనే కొనసాగుతోంది. ఈ రెండు కార్యాలయాల పక్కనే ఉన్న శిథిలావస్థలో ఉన్న స్టోర్‌రూమ్‌లో విలువైన డాక్యుమెంట్లు నిల్వచేశారు. వాటిని పరిరక్షించేందుకు అధికారులు ఏ మాత్రం చర్యలు తీసుకోవడం లేదు. స్టోర్‌రూమ్‌లో అవగాహన ఉన్న ఉద్యోగిని, వాచ్‌మెన్‌ను సైతం నియమించాల్సి ఉంది. స్టోర్‌రూం కాంప్లెక్స్ పెద్దగా లేకపోవడం, ప్రహరీ లేకపోవడం, స్టోర్‌రూంకు ఎలాంటి రక్షణ లేకపోవడంతో డాక్యుమెంట్లకు భద్రత కరువైంది. మునిసిపల్ కాంప్లెక్స్ ఇప్పటికే శిథిలావస్థకు చేరగా, అదే కాంప్లెక్స్‌లో స్టాంపులు, రిజిస్ట్రేషన్‌శాఖ కార్యాలయాలు కొనసాగుతున్నాయి.

డిజిటలైజేషన్ కొంతే...

గత ప్రభుత్వ హయాంలో పాత డాక్యుమెంట్ల డిజిటలైజేషన్ ప్రారంభించగా...

మిగతా 8వ పేజీలో..

ఎరువు.. బరువు

» మళ్లీ పెరిగిన ధరలు » భారంకానున్న సాగు
» డీఏపీ, యూరియా మినహా అన్ని ఎరువుల ధరల పెంపు
» బస్తాకు రూ.50 నుంచి రూ.100 పెరుగుదల
» ఉమ్మడి జిల్లా రైతులపై రూ.20కోట్ల అదనపు భారం



(ఆంధ్రజ్యోతి,మోత్కూరు)

కేంద్ర ప్రభుత్వం ఏడాదికోసారి పంటల మద్దతు ధర పెంచుతుండగా, ఎరువుల కంపెనీలు ప్రతీ సీజన్‌కు (ఏడాదికి రెండు సార్లు) ఎరువుల ధర పెంచుతున్నాయి. వానాకాలం పంటకు ముందు జూలైలో ఎరువులపై రూ.50 నుంచి రూ.330 వరకు ధర పెరగ్గా, ఈ యాసంగి నుంచి ఎరువుల బస్తాకు రూ.50 నుంచి రూ.100 వరకు ధరలు పెరిగాయి.

రూ.100 వరకు పెరిగిన కాంప్లెక్స్ ఎరువులు

ఎరువుల కంపెనీలు డీఏపీ, యూరియా మినహా మిగతా అన్ని రకాల కాంప్లెక్స్ ఎరువుల ధరలు పెంచాయి. రోజు రోజుకూ పెరుగుతున్న కూలి రేట్లు, యంత్ర పరికరాల ధరలకు తోడు ఎరువుల ధర పెరగడంతో రైతులు వ్యవసాయం చేయకపోవడమే మేలనే ఆలోచనకు వస్తున్నారు. అంతర్జాతీయ మార్కెట్లో ముడి సరుకుల ధరలు పెరిగినందున తయారీ ఖర్చులు పెరిగి గిట్టుబాటు కావడంలేదనే కారణంతో ఎరువుల ధరలు పెంచినట్టు కంపెనీల యజమానులు పేర్కొంటున్నారు. డీఏపీ ధర రూ.1,350, యూరియా ధర రూ.266.50 మాత్రం పెరగలేదు. ప్రస్తుతం మార్కెట్లో ధర పెరిగిన ఎరువుల బస్తాలనే వ్యాపారులు విక్రయిస్తున్నారు.

ఈ ఏడాది యాసంగి సీజన్‌లో సాగు విస్తీర్ణం పెరగనుందని వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేశారు. ఈ సీజన్‌లో యాదాద్రి జిల్లాలో సుమారు 20వేల టన్నుల కాంప్లెక్స్, సూర్యాపేట జిల్లాలో సుమారు 30వేల టన్నులు, నల్లగొండ జిల్లాలో సుమారు 50వేల టన్నుల కాంప్లెక్స్ ఎరువులు వినియోగిస్తారని అంచనా. బస్తాకు రూ.100 చొప్పున పెరుగుదలను లెక్కిస్తే ఉమ్మడి జిల్లా రైతులపై రూ.20కోట్ల అదనపు భారం పడుతోంది.

పెరిగిన ధరలు ఇలా..

ఎరువు రకం	గత ఏడాది ధర	వానకాలం ధర	పెరుగుదల	యాసంగి ధర	పెరుగుదల
20-20-0-13	1,300	1,400	100	1,450	50
10-26-26	1,470	1,800	330	1,900	100
15-15-15-0-9	1,450	1,600	150	1,650	50
16-20-0-13	1,250	1,300	50	1,400	100
14-35-14	1,700	1,800	100	1,900	100
28-28-0	1,600	1,700	100	1,800	100

నేడు 'మహిళా శక్తి' చీరల పంపిణీ



నల్లగొండ రూరల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ఈ నెల 22న 'ఇందిర మహిళా శక్తి' చీరల పంపిణీ కార్యక్రమాన్ని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ప్రారంభిస్తారని కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు. శుక్రవారం సాయంత్రం నిర్వహించిన టెలీకాన్ఫరెన్స్‌లో ఆమె మాట్లాడారు. ఈ నెల 22 నుంచి 24వ తేదీ వరకు చీరల పంపిణీని పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులను భాగస్వాములను చేయాలన్నారు. జిల్లాకు 4.34లక్షల చీరలు అవసరం కాగా, ఇప్పటి వరకు 3.50లక్షల చీరలు చేరాయన్నారు. మిగతా 84వేల చీరలు ఈ నెల 22న వస్తాయని చెప్పారు. టెలీ కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ నారాయణ్ అమిత్, డీఆర్డీవో శేఖర్‌రెడ్డి, ఆర్డీవో అశోక్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

తక్షణమే రక్షణ చర్యలు చేపట్టాలి

ఎస్పీ శరత్‌చంద్ర పవార్



ఈదులగూడ వై-జంక్షన్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ శరత్‌చంద్ర పవార్

మిర్యాలగూడ, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): బ్లాక్‌స్పాట్ల వద్ద తక్షణమే రక్షణ చర్యలు చేపట్టాలని అధికారులను ఎస్పీ శరత్‌చంద్ర పవార్ ఆదేశించారు. శుక్రవారం అద్దంకి-నార్కెట్‌పల్లి రహదారిపై మిర్యాలగూడ వద్ద నందిపాడు, ఈదులగూడ వై-జంక్షన్ గూడూరు, వాడపల్లి వద్ద బ్లాక్‌స్పాట్లను పరిశీలించారు. ఈదులగూడెం వై-జంక్షన్ వద్ద విలేకరులతో మాట్లాడుతూ, అతి వేగం, రాంగ్‌రూట్, లైటింగ్ సమస్యతో ప్రమాదాలు జరుగుతున్నట్లు గుర్తించామన్నారు. బ్లాక్‌స్పాట్ల వద్ద ప్రత్యేక రక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించామన్నారు. జంక్షన్ల వద్ద గ్రామాల నుంచి వచ్చే అప్రోచ్‌రోడ్లపై స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలన్నారు. వాటికి రంగులు వేయాలని, డంబెల్ స్టిక్స్ స్పీడ్ స్టాపర్ల ఏర్పాటుకు వారంలోగా చర్యలు తీసుకోవాలని నామ్ ఇంజనీర్లకు సూచించామన్నారు. నందిపాడు క్రాస్‌రోడ్ వద్ద రాంగ్‌రూట్‌లో వాహనాలు నడపకుండా ట్రాఫిక్ పోలీస్ ఔట్‌పోస్ట్‌ను ఏర్పాటు చేయాలని డీఎస్పీని ఆదేశించామన్నారు. గూడూరు వద్ద రోడ్డు క్రాసింగ్‌కు ఊరు మధ్యలో ఓపెన్ చేసిన డివైడర్‌ను మూసివేసి దామరచర్ల, మిర్యాలగూడ వైపు తెరవాలన్నారు. ఎస్పీ వెంట మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖర్‌రాజు, వన్‌టౌన్ సీఐ నాగభూషణం, ఎస్ఐ సైదిరెడ్డి, రాంబాబు, తదితరులు ఉన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

డీఎంహెచ్‌వో పుట్ల శ్రీనివాస్



ఆస్పత్రిలో రికార్డులను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో శ్రీనివాస్

పెద్దఅడిశర్లపల్లి, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధులపై వైద్యులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్‌వో పుట్ల శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని గుడిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన తనిఖీచేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రసూతి, తదితర రికార్డుల నిర్వహణ సరిగా ఉండాలన్నారు. సీజనల్ వ్యాధులు, జ్వరాలు, కుక్క కాటు కేసుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రత్యేకంగా ల్యాబ్‌లో ఆటో ఎనలైజర్ వాడుతున్నందుకు సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన వెంట డిప్యూటీ డీఎంహెచ్‌వో రవి, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ప్రియాంక, తదితరులు ఉన్నారు.

లాటరీ విధానంలో లబ్ధిదారుల ఎంపిక

చింతపల్లి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నెల్వలపల్లిలో నిర్మించిన 20 డబుల్ బెడ్ రూమ్ ఇళ్లకు శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో అధికారులు లాటరీ విధానంలో లబ్ధిదారులను ఎంపిక చేశారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లకు అర్హులు 33మంది ఉండగా, అందులో 20 మందిని ఎంపిక చేశారు. కార్యక్రమంలో హౌసింగ్ పీడీ రాజ్‌కుమార్, తహసీల్దార్ విజయలక్ష్మి, ఎంపీడీవో సుజాత, డీఈ నాగేంద్ర, డీటీ హర్షద్, పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి గిరిజనుల వద్దకే

» 'ప్రజావాణి'లో ఫిర్యాదుతో కదలిన అధికారులు
» తండాకు వచ్చిన కలెక్టర్, ఎమ్మెల్యే



చెంచోనితండాలో పర్యటిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి, తదితరులు

తిరుమలగిరి(సాగర్), నవంబరు 21(ఆంధ్రజ్యోతి): తండాలో నెలకొన్న సమస్యలపై ఆదెమ్మ అనే మహిళ జిల్లా కేంద్రంలో 'ప్రజావాణి'లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు అధికారులు కదిలారు. మండలంలోని మారుమూల ప్రాంతమైన చెంచోనితండాకు కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి, ఇతర అధికారులు శుక్రవారం వచ్చారు. తండాలో ఆధార్‌కార్డులు, ప్రభుత్వ ధ్రువపత్రాలు లేనివారి కోసం ప్రత్యేకంగా ఆధార్, మీ-సేవా సిబ్బందితో ప్రత్యేక శిబిరం నిర్వహించారు. దీంతో తండాకు చెందిన 72 మంది ఆధార్‌లో మార్పులు చేర్పులు చేయించుకోగా, నేటికీ ఆధార్ కార్డు లేని 21 మందికి నూతనంగా జారీచేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి తండావాసుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సంతానం ఎక్కువగా ఉన్న కుటుంబాలకు ప్రభుత్వం ఇచ్చే ఆరు కిలోల బియ్యం సరిపోవడంలేదని, 32 కిలోల బియ్యం కోసం అంత్యోదయకార్డులు ఇవ్వాలని స్థానికులు విన్నవించారు. కొంతమందికి రేషన్‌కార్డులు, ఉపాధిహామీ జాబ్‌కార్డులు లేవని చెప్పగా, పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని వారు హామీ ఇచ్చారు. తాగునీటి బోర్‌కు మరమ్మతులు చేయిస్తామని, సెల్‌ఫోన్ సిగ్నల్ విషయమై సంబంధిత అధికారులతో మాట్లాడతామన్నారు. పెన్షన్లు ప్రతి నెలా తీసుకోవాలని, రైతులు కొత్తగా అటవీ భూములను నరకవద్దని సూచించారు. చెంచుల అభివృద్ధికి అన్ని విధాలా సహకరిస్తామన్నారు. ఇందిరమ్మ ఆత్మీయభరోసా, పెన్షన్ల కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రభుత్వ ఆస్పత్రిలో అన్ని రకాల సదుపాయాలు ఉన్నందున అక్కడే చికిత్స చేయించుకోవాలని సూచించారు. తండాకు చెందిన వారినే ఆశా, అంగన్‌వాడీ, ఏఎన్ఎంలుగా నియమించేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరగా కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. తండాలో ఎమ్మెల్యే, కలెక్టర్, అధికారులు కలియ తిరుగుతూ సమస్యలను పరిశీలించారు. గ్రామపంచాయతీ, అంగన్‌వాడీ కేంద్రాలకు పక్కా భవనాలు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నారాయణ్‌అమిత్, డీఆర్‌డీఏ పీడీ శేఖర్‌రెడ్డి, హౌసింగ్ పీడీ రాజ్‌కుమార్, డీఎంహెచ్‌వో డాక్టర్ పుట్ల శ్రీనివాస్, జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి డాక్టర్ రమేష్, హాలియా మార్కెట్ కమిటీ చైర్మన్ తుమ్మలపల్లి చంద్రశేఖర్‌రెడ్డి, తహసీల్దార్ అనిల్, ఎంపీడీవో భిక్షంరాజు, ఎంఈవో శ్రీనివాస్, ఏవో హర్షిత, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కలసాని చంద్రశేఖర్, గడ్డం సాగర్‌రెడ్డి, పాల్గొన్నారు.

బడి బయట పిల్లల కోసం

ప్రత్యేక సర్వే

» ప్రారంభించిన విద్యాశాఖ » సర్వే నిర్వహించనున్న సీఆర్పీలు



భువనగిరి రూరల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): బడి ఈడు పిల్లలు పాఠశాలలకు వెళ్లేలా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు ప్రారంభించింది. వివిధ కారణాలతో మధ్యలోనే పాఠశాలలకు దూరమైన వారిని గుర్తించి ప్రభుత్వ విద్యాసంస్థల్లో చేర్పించేందుకు సన్నద్ధమైంది.

రాష్ట్ర వ్యాప్తంగా 2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించి బడి బయట పిల్లలను గుర్తించేందుకు సర్వే నిర్వహించాలని రాష్ట్ర సమగ్ర శిక్ష సంచాలకుడు ఉత్తర్వులు జారీ చేశారు. ఈనెల 20 నుంచి డిసెంబరు 31 వరకు ఉమ్మడి నల్లగొండ జిల్లాలో మొత్తం 214 మంది క్లస్టర్ రిసోర్స్ పర్సన్లు (సీఆర్పీలు) ఈ సర్వేలో పాల్గొంటారు.

రెండు విభాగాలుగా

పాఠశాలలకు వెళ్లకుండా బాల కార్మికులుగా పని చేస్తున్న వారిని రెండు విభాగాలుగా గుర్తించేందుకు సర్వే నిర్వహిస్తున్నారు. సర్వేలో 6-14 ఏళ్లు, 15-19 ఏళ్ల వారిని వేర్వేరుగా గుర్తిస్తారు. సర్వే నిర్వహణపై జిల్లా స్థాయిలో ఒక్క రోజు శిక్షణ ఇచ్చినట్లు యాదాద్రి జిల్లా డీఈవో కె.సత్యనారాయణ తెలిపారు. పాఠశాల సముదాయాల పరిధిలో పని చేస్తున్న క్లస్టర్ రిసోర్స్ పర్సన్లకు (సీఆర్పీలు) సర్వే బాధ్యతలు అప్పగించారు.

ఉన్నతాధికారులకు నివేదికలు

పాఠశాలలకు వెళ్లకుండా ఉంటున్న వారి వివరాలను సీఆర్పీలు వారి పాఠశాలల పరిధిలో సేకరిస్తారు. చిన్నారుల ఇంటింటికీ వెళ్లి తల్లిదండ్రులతో మాట్లాడతారు. మండల స్థాయిలో ఎంఈవో, స్కూల్ కాంప్లెక్స్ పాఠశాలల హెచ్ఎంల ఆధ్వర్యంలో నిర్వహించిన సర్వే నివేదికను ప్రతీ రోజు జిల్లా విద్యాధికారికి అందజేయనున్నారు. డిసెంబరు 31వ తేదీ వరకు సర్వే పూర్తి కావాల్సి ఉంది. ఆ తర్వాత మండల విద్యాధికారులు 2026, జనవరి 2 వరకు డీఈవోలకు, జనవరి 12 వరకు జిల్లా విద్యాశాఖ అధికారులు రాష్ట్రస్థాయి విద్యాశాఖ అధికారులకు నివేదికలు అందజేస్తారు. సర్వే వివరాలను కేంద్ర ప్రభుత్వం ఆధీనంలోని 'ప్రబంధ్' పోర్టల్‌తో పాటు 'చైల్డ్ ఇన్ఫో' వెబ్‌సైట్‌లో నమోదు చేస్తారు. గతంలో సేకరించిన వివరాలను నమోదు చేస్తారు.

క్షయ రహిత సమాజం కోసం కృషి



న్యూట్రీషన్ కిట్ అందజేస్తున్న కల్యాణచక్రవర్తి

శాలిగౌరారం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): క్షయ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా క్షయ వ్యాధి నివారణాధికారి కల్యాణ చక్రవర్తి కోరారు. శుక్రవారం స్థానిక పీహెచ్‌సీని ఆయన తనిఖీచేశారు. అనంతరం భారతి రంగ ఆర్గనైజేషన్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో పోషకాహార కిట్లను క్షయ వ్యాధిగ్రస్థులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లాలో 2వేల మందికి పైగా క్షయవ్యాధిగ్రస్థులు ఉన్నారని, వ్యాధి నివారణకు పెద్ద ఎత్తున ప్రచారం చేస్తున్నామన్నారు. వ్యాధి లక్షణాలు కనబడితే వెంటనే గుర్తించి తగిన చికిత్స చేయించుకోవాలన్నారు. వైద్య సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే సహించేదిలేదన్నారు. ఆయన వెంట మండల వైద్యాధికారి సూర్య శిల్ప, శ్వేత, ఎన్.రాములమ్మ, సూపర్ వైజర్లు మరియా, దయామణి, యాసారపు రామకృష్ణ, సైదులు, హెల్త్ అసిస్టెంట్ మొలుగూరి భాస్కర్, శ్రీనివాస్, తదితరులు ఉన్నారు.

బీసీ రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించాలి

బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనారాయణ



కలెక్టరేట్ ముట్టడిలో మాట్లాడుతున్న లక్ష్మీనారాయణ

నల్లగొండ (కలెక్టరేట్), నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): బీసీ రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించాకే స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు దుడుకు లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడారు. కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌తో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండేళ్లు గడుస్తున్నా 42శాతం రిజర్వేషన్లపై మాట్లాడకపోవడం శోచనీయమన్నారు. రిజర్వేషన్లపై పలు ఆందోళనల అనంతరం అసెంబ్లీలో ఏకగ్రీవ తీర్మానం చేసి గవర్నర్‌కు, రాష్ట్రపతికి పంపించారన్నారు. ప్రధానమంత్రిని హైదరాబాద్‌కు రప్పిస్తానంటూ ప్రగల్భాలు పలికిన సీఎం రేవంత్‌రెడ్డి 56 సార్లు ఢిల్లీకి వెళ్లినా ఒక్కసారి కూడా ప్రధానిని కలవకపోవడం శోచనీయమన్నారు. ధర్నా అనంతరం కలెక్టరేట్ ఏవోకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కార్యదర్శి గుండు వెంకటేశ్వర్లు, నాయకులు సింగం లక్ష్మీనారాయణ, జెర్రిపోతుల రమేష్‌గౌడ్, అయితగోని జనార్ధన్‌గౌడ్, కట్ట హరిబాబు, బక్కతట్ల వెంకన్నయాదవ్, కట్టకోలు దీపేందర్, మచ్చ నాగరాజు, తిరపతయ్యగౌడ్, పుట్టవెంకన్న, యాదగిరి, పాల్గొన్నారు.

రణభేరి సభను విజయవంతం చేయాలి

మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు మధుబాబు



సమావేశంలో మాట్లాడుతున్న లకుమాల మధుబాబు


నల్లగొండ టౌన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో ఈనెల 23న నిర్వహించే రణభేరి మహాసభను విజయవంతం చేయాలని మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు లకుమాల మధుబాబు పిలుపునిచ్చారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని మాలమహానాడు కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సుప్రీంకోర్టు సూచనలకు విరుద్ధంగా, 2011 జనాభా లెక్కలతో చేసిన ఎస్సీ వర్గీకరణను ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలన్నారు. జీవో 99ని సవరించాలని, మాలలతో పాటు గ్రూప్-3లో ఉన్న మరో 25 కులాలకు న్యాయం చేయాలన్నారు. చేవెళ్ల డిక్లరేషన్ ప్రకారం ప్రస్తుత జనాభాకు అనుగుణంగా ఎస్సీల రిజర్వేషన్ శాతాన్ని పెంచాలని, పెండింగ్‌లో స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. మాల కార్పొరేషన్ ఏర్పాటు చేసి రూ.1,000కోట్లు నిధులు కేటాయించాలన్నారు. రణభేరి మహాసభకు లక్షలాదిగా తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో సంఘం జిల్లా సోషల్ మీడియా అధ్యక్షుడు జంగాల వీరేందర్, నాయకులు రాయల మౌనిక, నాగమణి, శ్రీలత, వెంకన్న, నల్వాది ప్రభాకర్, జంగయ్య, రజనీకాంత్, శ్రీనివాస్, వెంకటేష్, తిరుమలేష్, వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.



మరమ్మతులతో గుబులు

- తరుచూ ధ్వంసమవుతున్న కృష్ణాజలాల పైప్‌లైన్లు
- వందలాది గ్రామాలకు నిలిచి పోతున్న భగీరథ నీటి సరఫరా
- వాటర్ కొనుగోలు చేసి తాగుతున్నామని ప్రజల ఆవేదన
- పట్టించుకోని భగీరథ అధికారులు
- శాశ్వత పరిష్కార చర్యలు చేపట్టాలని వేడుకోలు





వ్యవసాయ బావుల నుంచి నీరు తెచ్చుకుంటున్న పోలేపల్లి గ్రామస్థులు

డిండి మండలం కందుకూరు వాగులో పగిలిపోయిన పైప్‌లైన్‌లకు మరమ్మతులు చేస్తున్న అధికారులు (ఫైల్)

దేవరకొండ, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): దేవరకొండ డివిజన్‌లోని గ్రామాల్లో కొంతకాలంగా మిషన్ భగీరథ పైప్‌లైన్లు పగిలిపోవడం, సాంకేతిక సమస్యలు తలెత్తుతున్నాయి. గ్రామాలకు కృష్ణా జలాల సరఫరా తరచూ నిలిచిపోతుంది. దీంతో గ్రామాల ప్రజలు మంచినీటి కోసం ఇబ్బందులు పడే పరిస్థితి నెలకొంది. దేవరకొండ డివిజన్ పరిధిలో 320 గ్రామపంచాయతీలు ఉన్నాయి. మిషన్ భగీరథ ద్వారా డివిజన్ పరిధిలోని మండలాలలోని గ్రామాలకు కోదండాపురం వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్, పెండ్లిపాకల, ఎస్.లింగోటం వాటర్ ప్లాంట్ల నుంచి పైప్‌లైన్ల ద్వారా అధికారులు కృష్ణా జలాలు సరఫరా చేస్తున్నారు. కానీ 3 నెలల నుంచి కృష్ణాజలాల పైప్‌లైన్లు తరచూ పగులుతుండటం, వర్షాల కారణంగా పైప్‌లైన్ల జాయింట్లు ఊడిపోవడంతో నీటి సరఫరాకు అంతరాయం కలుగుతుంది. దీంతో వందలాది గ్రామాలకు మిషన్ భగీరథ నీరు అందక ప్రజలు ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకునే పరిస్థితి నెలకొంది. సెప్టెంబరు నెలలో డిండి మండలంలోని ఎగువభాగాన కురిసిన భారీ వర్షాలకు కందుకూరు వాగులోని మిషన్‌భగీరథ పైప్‌లైన్ పగిలిపోయింది. దీంతో చందంపేట, డిండి మండలాలలోని 120 గ్రామాలకు రెండు నెలలు కృష్ణాజలాల సరఫరా నిలిచిపోయాయి. దీంతో పండగల సమయంలో కృష్ణా జలాలు రాక ఆయా గ్రామాల ప్రజలు ప్యూరిఫైడ్ వాటర్ కొనుగోలు చేయడంతో పాటు బోరు, బావుల నీరు తాగే పరిస్థితి. ఇటీవల చందంపేట మండలం పోలేపల్లిలో మిషన్‌భగీరథ పైప్‌లైన్ పగిలిపోయింది. దీంతో నీరు వృథాగా పోతుంది. నీటి సరఫరా చేసే పైప్‌లైన్లు పగలడంతో వారం రోజులుగా పోలేపల్లి, పరిసర గ్రామాలకు కృష్ణా జలాల సరఫరా నిలిచిపోయింది. దీంతో ఆయా గ్రామాల ప్రజలు బోరు, బావులు, వ్యవసాయ పొలాల వద్దకు వెళ్లి నీరు తెచ్చుకొని తాగే పరిస్థితి నెలకొంది. డిండి మండలం వావిల్‌కోల్ వాగులో మిషన్ భగీరథ పైప్‌లైన్ పగిలిపోవడంతో మూడు గ్రామాలకు మంచినీటి సరఫరా నిలిచిపోయింది. అధికారులు మరమ్మతు చర్యలు చేపడుతున్నారు.

నాంపల్లిలో 13 గ్రామాలకు నిలిచిన కృష్ణాజలాలు

నాంపల్లి మండలం మేళ్లవాయి వద్ద ఆర్‌అండ్‌బీ రోడ్ల నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో కృష్ణాజలాల పైప్‌లైన్లు మరమ్మతులకు గురయ్యాయి. దీంతో మండలంలోని 13 గ్రామాలకు కృష్ణా జలాల సరఫరా నిలిచిపోయింది. ఆయా గ్రామాల ప్రజలు బోరు బావుల నీరే తాగే పరిస్థితి. మరికొందరు విధిలేని పరిస్థితిలో ప్యూరిఫైడ్ వాటర్ క్యాన్‌కు రూ.15 పెట్టి కొనుగోలు చేసి తాగుతున్నారు. త్వరగా పైప్‌లైన్ల పనులు,మరమ్మతులు చేసి కృష్ణాజలాలు సరఫరా చేయాలని ఆయాగ్రామాల ప్రజలు కోరుతున్నారు. దేవరకొండ డివిజన్ పరిధిలోని దేవరకొండ, చందంపేట, డిండి, నాంపల్లి, కొండమల్లేపల్లి, పీఏపల్లి మండలాల్లో మిషన్‌భగీరథ పైప్‌లైన్లు తరచూ పగులుతుండటం, సాంకేతిక సమస్యలు తలెత్తుతుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సమస్య ఉత్పన్నమైన వెంటనే యుద్ధప్రాతిపదికన పనులు చేపట్టి సమస్యలను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.



పగిలిపోయిన మిషన్‌భగీరథ పైప్‌లైన్

నీటిని కొనుగోలు చేసి తాగుతున్నాం



కృష్ణాజలాల పైప్‌లైన్ పగలడం వల్ల 15 రోజులుగా భగీరథ నీరు నిలిచిపోయింది. విధి లేని పరిస్థితిలో బోరు నీరు వేడి చేసుకొని తాగుతున్నాం. మినరల్ వాటర్ క్యానుకు రూ.15 కొనుగోలు చేస్తున్నాం. సాగర్ నీటికి అలవాటుపడి రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం.

- మమత, తుమ్మలపల్లి, నాంపల్లి మండలం

కృష్ణాజలాలు సక్రమంగా సరఫరా చేస్తాం

ఇటీవల కురుస్తున్న వర్షాలకు మిషన్ భగీరథ పైప్‌లైన్లు మరమ్మతులకు గురవుతున్నాయి. నీటి సరఫరాకు అంతరాయం కలుగుతుంది. డిండి మండలం కందుకూరు, వావిల్‌కోల్ వాగులు ప్రవహిస్తుండటంతో మరమ్మతులకు జాప్యం జరిగింది. నాంపల్లి మండలంలో రోడ్లు నిర్మిస్తున్నందున పైప్‌లైన్ల మరమ్మతు పనులకు అంతరాయం ఏర్పడింది. మరమ్మతులు నిర్వహించి అన్ని గ్రామాలకు కృష్ణాజలాలు సరఫరా చేస్తాం.

- లక్ష్మీనారాయణ, ఈఈ, మిషన్‌భగీరథ

దేవరకొండ మునిసిపాలిటీలో...

దేవరకొండ మునిసిపాలిటీలో 20వార్డులు ఉన్నాయి. పట్టణంలో 8,484 నల్లా కనెక్షన్లు ఉన్నాయి. మిషన్‌భగీరథ నీటి సరఫరాలో తరుచూ అంతరాయం కలుగుతుండటంతో పట్టణ ప్రజలు మంచినీటి కోసం ఇబ్బంది పడే పరిస్థితి ఏర్పడింది. శివారు కాలనీల ప్రజలకు కృష్ణా జలాల సరఫరా కాకపోవడంతో ప్యూరిఫైడ్ వాటర్ కొనుగోలు చేసి తాగుతున్నారు. మిషన్‌భగీరథ అధికారులు తరచుగా పైప్‌లైన్లు పగిలి కృష్ణానీటి సరఫరాలో అంతరాయం కలిగినప్పటికి పట్టించుకోవడం లేదు. పైప్‌లైన్లకు మరమ్మతులు నిర్వహించి యథావిధిగా కృష్ణాజలాలు సరఫరా చేయాలని ప్రజలు కోరుతున్నారు.

పౌష్టికాహారం తీసుకోవాలి

చందంపేట, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సత్యకుమారి అన్నారు. మండలంలోని పోలేపల్లి వెంకటితండాలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఆడపిల్లలను కాపాడుకోవాలని, వారికి మంచి విద్యను అందించి ప్రోత్సహించాలన్నారు. గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకొని ఆరోగ్యంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది, ఆయాలు పాల్గొన్నారు.

రైతులు నష్టపోవద్దు

త్రిపురారం నవంబరు 21(ఆంధ్రజ్యోతి): తాము పండించిన ధాన్యాన్ని రైతులు దళారులకు విక్రయించి నష్టపోవద్దని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముడిమాళ్ల బుచ్చిరెడ్డి అన్నారు. మండలంలోని అప్పలమ్మగూడెం, డొంకతండా గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను శుక్రవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. రైతులు నిబంధనల ప్రకారం ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి మద్దతు ధర పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సలహాదారుడు అనుముల శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు భాస్కర్‌నాయక్, మాజీజడ్పీటీసీ ధన్‌సింగ్‌నాయక్ పాండు, రవి, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన విద్యుత్ అందించేందుకు కృషి : ఎమ్మెల్యే బాలునాయక్



గాజీనగర్‌లో విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణాన్ని శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే బాలునాయక్

పెద్దఅడిశర్లపల్లి, కొండమల్లేపల్లి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని రైతాంగంతో పాటు అన్నివర్గాల ప్రజలకు మెరుగైన విద్యుత్ సరఫరా చేసేందుకు ప్రభుత్వం అహర్నిశలు కృషి చేస్తుందని ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. శుక్రవారం పెద్దఅడిశర్లపల్లి మండలంలోని మేడారం గ్రామం, కొండమల్లేపల్లి మండలం గాజీనగర్ తండాలో నూతనంగా నిర్మించనున్న సబ్‌స్టేషన్ నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన అనతికాలంలోనే గృహజ్యోతి పథకంలో భాగంగా వినియోగదారులకు 200 యూనిట్ల వరకు ఫ్రీ కరెంటును అందజేస్తున్నట్లు ఆయన తెలిపారు. వ్యవసాయానికి నాణ్యమైన విద్యుత్ అందించడమే ప్రజాప్రభుత్వం లక్ష్యమని అన్నారు. మండలంలో ఉన్న లోవోల్టేజీ సమస్యను పూర్తిగా నివారించి, రైతులకు నిరంతర విద్యుత్ సరఫరా చేయడమే తమ ప్రథమ కర్తవ్యమని పేర్కొన్నారు. మేడారం విద్యుత్ సబ్‌స్టేషన్ పనులను వేగంగా పూర్తి చేయాలని అధికారులు, కాంట్రాక్టర్లను ఆదేశించారు. పెండ్లిపాకల ప్రాజెక్టు అభివృద్ధి కారణంగా వంద మీటర్ల పరిధిలో ప్రభావితమయ్యే 40 కుటంబాలకు ప్రభుత్వం నుంచి ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజిలో పునరావాసం కల్పిస్తామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. పెద్దఅడిశర్లపల్లిలో నిర్వహించిన కార్యక్రమంలో డీఈ విద్యాసాగర్, ఏడీ సైదులు, కనెక్షన్ డీఈ వెంకటయ్య, ఏఈ దేవోజీనాయక్, మాజీ సర్పంచ్ అరుణ ప్రభాకర్‌రెడ్డి, ముచ్చర్ల ఏడుకొండలుయాదవ్, కసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, హనుమారెడ్డి, అంతిరెడ్డి, నారాయణ, కొండమల్లేపల్లి మండలం గాజీనగర్ తండాలో నిర్వహించిన కార్యక్రమంలో ఏఈ లక్కీదాస్, మార్కెట్ కమిటీ ఛైర్‌పర్సన్ నాయిని జమున మాధవరెడ్డి, మునిసిపల్ మాజీ ఛైర్మన్ ఆలంపల్లి నర్సింహ, టీపీసీసీ సభ్యులు వేణుధర్‌రెడ్డి, నాయకులు రేఖాశ్రీధర్‌రెడ్డి, సిరాజ్‌ఖాన్, వేమన్‌రెడ్డి, యుగేందర్‌రెడ్డి, మేకల శ్రీనివాసులు, యాదగిరి, కాసర్ల వెంకటేశ్వర్లు, యువజన కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారుల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి

కొండమల్లేపల్లి: మత్స్యకారుల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే బాలునాయక్ అన్నారు. ప్రపంచ మత్స్యకారుల దినోత్సవం పురస్కరించుకొని శుక్రవారం మండలంలోని పెండ్లిపాకల చెరువులో 9లక్షల చేప పిల్లలను వదిలారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ త్వరలోనే నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న అన్ని చెరువుల్లో 1.30 కోట్ల చేప పిల్లలను ఉచితంగా పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. పెండ్లిపాకల చెరువు రొయ్యల పెంపకానికి అనువైనది కావడంతో ఈ ఏడాది రొయ్య పిల్లలను కూడా విడుదల చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మత్స్యశాఖ ఏడీ రాజారాం, సొసైటీ ఛైర్మన్ శక్రునాయక్, జిల్లా సొసైటీ డైరెక్టర్ శ్రీనివాసులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

దేవాలయాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

దేవరకొండ: దేవాలయాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే బాలునాయక్ అన్నారు. దేవరకొండ పట్టణంలోని శివాలయంలో కార్తీకమాసం ముగింపు సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. ప్రతి ఒక్కరు దైవభక్తి కలిగి ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ ఛైర్‌పర్సన్ జమునమాధవరెడ్డి, నాయకులు ఆలంపల్లి నర్సింహ, డాక్టర్ వేణుధర్‌రెడ్డి, మల్లయ్య, వెంకన్న, పురుషోత్తం, ఆలయ ప్రధాన అర్చకుడు సురభి కృష్ణమూర్తిశర్మ తదితరులు పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు



వాహనదారులను తనిఖీ చేస్తున్న ఎస్ఐ

నేరేడుగొమ్ము, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మద్యం సేవించి వాహనాలు నడిపితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ నాగేంద్రబాబు హెచ్చరించారు. శుక్రవారం పెద్దమునిగల్ - వైజాగ్ కాలనీ పరిధిలో వాహన తనిఖీలు నిర్వహించారు. గంజాయి, ఇతర మాదక ద్రవ్యాల అక్రమ రవాణాను అరికట్టేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పాఠశాల బస్సులు, ఆటోలను అతివేగంగా నడపవద్దని డ్రైవర్లకు సూచించారు. ఆటోలకు, బస్సులకు సంబంధించిన కాలపరిమితి పేపర్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో వార్షికోత్సవ పూజలు

మిర్యాలగూడటౌన్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): మిర్యాలగూడ పట్టణంలోని ప్రకాష్‌నగర్ శ్రీభక్తాంజనేయ స్వామి ఆలయ వార్షికోత్సవ పూజలు వైభవంగా నిర్వహించారు. అఖండ దీపారాధన, గణపతి పూజ, స్వస్తి పుణ్యావచకం, పంచకల అభిషేకం జరిపిన అనంతరం మంగళహారతులు, వేద మంత్రాలతో స్వామివారిని పూజించారు. ఉత్సవాల్లో భాగంగా మాలధారణ చేసిన వందలాది భక్తులకు భిక్ష ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్, గిరిజన సంఘం రాష్ట్ర నాయకుడు బానావత్ రతన్‌సింగ్‌నాయక్, ఆలయ కమిటీ సభ్యులు బావండ్ల పాండు, దేశీరాంనాయక్, తేలుకుంట్ల శేఖర్, మదనాచారి, వెంకన్న, శ్రీరాములు, నర్సింహ, శ్రీనివాస్, సురేష్, యాదగిరి, అజయ్, నాగేశ్వర్, రవి, మంగ్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.

ముదిరాజ్‌ల సమస్యలను పరిష్కరించాలి

దేవరకొండ, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): ముదిరాజ్‌ల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని ముదిరాజ్‌ల సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు రసమళ్ల నాగయ్యముదిరాజ్ అన్నారు. దేవరకొండలో శుక్రవారం మత్స్యకారుల దినోత్సవం పురస్కరించుకొని ముదిరాజ్ భవన్‌లో జెండాను ఎగురవేసి మాట్లాడారు. ముదిరాజులను బీసీ డీ నుంచి బీసీ ఏలోకి మార్చాలని ప్రభుత్వాన్ని కోరారు. ముదిరాజులంతా ఐక్యంగా ఉండి సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ముదిరాజు సంఘం నాయకులు రెడ్డి శంకర్, శ్రీను, జింకల మధు, నీల వెంకటయ్య, శ్రీను, నాగేంద్ర పాల్గొన్నారు.

చింతపల్లి: చింతపల్లి మండల కేంద్రంలో మత్స్యకారుల దినోత్సవాన్ని ముదిరాజ్ కులస్థులు ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు చింతపల్లి మండల కేంద్రంతో పాటు నసర్లపల్లి, కుర్మేడ్‌లో ముదిరాజ్ మహాసభ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా ముదిరాజ్ మహాసభ నియోజకవర్గ అధ్యక్షుడు బుడిగ వెంకటయ్య మాట్లాడుతూ సమస్యల సాధన కోసం కలిసికట్టుగా ఉండాలన్నారు. ముదిరాజ్ కులస్థులందరూ సమాజంలో ఆర్థిక, రాజకీయ రంగాల్లో రాణించినప్పుడు తగిన గుర్తింపు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో యువజన విభాగం అధ్యక్షుడు మొక్తాల శేఖర్, పోలేమోని చంద్రశేఖర్, పాపారావు, శ్రీశైలం, మేకల దేవేందర్, యాట ప్రసాద్, శ్రీను, రాజు, సైదులు, జంగయ్య, సుధాకర్, శివయ్య, రాణెమ్మ, జంగయ్య, రాములు పాల్గొన్నారు.

ప్రజల నమ్మకాన్ని కోల్పోయిన ప్రభుత్వం

చందంపేట, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): ఇటీవల జరిగిన బీహార్ ఎన్నికల్లో ఎన్డీఏ ఘన విజయం సాధించిందని బీజేపీ మండల అధ్యక్షుడు వినోదచారి అన్నారు. చందంపేట మండలం పోలేపల్లి ఎక్స్‌రోడ్డు వద్ద శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశమంతటా కాంగ్రెస్ పార్టీ ప్రజల విశ్వాసం కోల్పోయిందని, రాహుల్‌గాంధీ నాయకత్వం ప్రజలు విశ్వసించే స్థితిలో లేరని అన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ నాయకత్వంలో దేశం అనేక రంగాల్లో అభివృద్ధి సంక్షేమంలో దూసుకుపోతుందన్నారు. తెలంగాణలో బీజేపీ అధికారం చేపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో బీజేపీ మాజీ అధ్యక్షుడు పాత్లావత్ ఆంజనేయులు, నాయకులు శివ, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యలను పరిష్కరించడంలో విఫలం

వేములపల్లి, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): రైతుల భూ సమస్యలను పరిష్కరించడంలో భూభారతి విఫలమైందని సీపీఎం మండల కార్యదర్శి పాదూరి శశిధర్‌రెడ్డి ఆరోపించారు. మండలకేంద్రంలో శుక్రవారం నిర్వహించిన సమావేశం లో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వం తీసుకొచ్చిన ధరణిలో లోపాలు ఉన్నాయని కాంగ్రెస్ ప్రభుత్వం భూభారతి తీసుకొచ్చిందన్నారు. కానీ భూభారతి లో సైతం భూ సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. ఇప్పటికైనా భూభారతిలో భాగంగా స్వీకరించిన దరఖాస్తులన్నింటినీ తక్షణమే పరిష్కరించాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో సీపీఎం నాయకులు చల్లబొట్ల ప్రణీత్‌రెడ్డి, వడ్డెగాని సైదులు, అనిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, పుట్ట రేణయ్య, భిక్షం, లత్తు పాల్గొన్నారు.

నేటి సాగర్ - శ్రీశైలం లాంచీ ప్రయాణం రద్దు

● పర్యాటకుల సంఖ్య తక్కువగా ఉండటంతో నిర్ణయం

నాగార్జునసాగర్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): ప్రపంచ పర్యాటక కేంద్రమైన నాగార్జునసాగర్ నుంచి శ్రీశైలంకు లాంచీ ప్రయాణాన్ని రద్దుచేసినట్లు పర్యాటక శాఖ అధికారులు తెలిపారు. నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్ హిల్‌కాలనీ నుంచి నంద్యాల జిల్లా శ్రీశైలానికి ఈ నెల 22వ తేదీ నుంచి ప్రతి శనివారం లాంచీలు నడపాలని పర్యాటక శాఖ నిర్ణయించింది. పర్యాటకులు తక్కువ సంఖ్యలో టికెట్లు బుక్ చేసుకోవడంతో ఈ నెల 22న(శనివారం) లాంచీ ప్రయాణాన్ని రద్దు చేసినట్లు పర్యాటక శాఖ అధికారులు తెలిపారు. 100మంది పర్యాటకులు బుక్ చేసుకుంటే సాగర్ - శ్రీశైలం లాంచీని నడుపుతామని పేర్కొన్నారు. పర్యాటకుల సంఖ్య మేరకు లాంచీలు నడుపుతామని పర్యాటక శాఖ అధికారులు తెలిపారు.

మత్స్యకారుల ఉపాధి కోసమే చేపల పెంపకం



చెరువులో చేప పిల్లలను వదులుతున్న కాంగ్రెస్ నాయకులు

హాలియా, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): ఒక వైపు మత్స్యకారులకు ఉపాధి, మరో వైపు చేపల ఉత్పత్తికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని కాంగ్రెస్ పార్టీ అనుముల మండల అధ్యక్షుడు కుందూరు వెంకట్‌రెడ్డి అన్నారు. అనుముల మండలం పేరూరు గ్రామంలోని సోమసముద్రం చెరువులో శుక్రవారం చేపలను వదిలారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేపల పెంపకం ద్వారా ఆదాయం సమకూరి మత్స్యకారుల కుటుంబాల సంక్షేమానికి దోహదపడుతుందన్నారు. మత్స్యకారులు వాటి పెంపకానికి జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి కాకునూరి నా రాయణగౌడ్, తహసీల్దార్ రఘు, యూత్ కాంగ్రెస్ జిల్లా మాజీ అధ్యక్షుడు గౌని రాజారమేష్ యాదవ్, మజహర్ మొయినుద్దీన్, ఆర్. నవీన్, ఇరిగేషన్ ఏఈ వర్క్ ఇన్‌స్పెక్టర్ కుందూరు రాజేందర్‌రెడ్డి, పసుల రవి, పొదిల కృష్ణ, పిల్లి ఆంజనేయులు, రిక్కల సుధాకర్‌రెడ్డి, పేరూరు దేవస్థానం ఛైర్మన్ రిక్కల కొండారెడ్డి, రామలింగయ్య, జానీపాషా, గౌస్‌మియా, శోభన్ బాబు, యూసుఫ్, అస్గర్, డీలర్ అస్గర్ తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను నిర్మూలించాలి

గుర్రంపోడు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలను నిర్మూలించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రమీల అన్నారు. మండలంలోని జూనుతుల యూపీపీఎస్ పాఠశాలలో శుక్రవారం బేటీ బచావో, బేటీ పఢావో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని అన్నారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు త్రివేణి, శామల, రవి, పంచాయతీ కార్యదర్శి రమేష్, అంగన్‌వాడీ టీచర్ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కొండమల్లేపల్లి: కొండమల్లేపల్లి మండలంలోని కొల్‌ముంతలపహాడ్ గ్రామ సమీపంలోని కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ కత్తుల సరళ, వరలక్ష్మి మాట్లాడారు. బాల్య వివాహాల వల్ల కలిగే అనారోగ్య సమస్యలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

సేవాభావం అలవర్చుకోవాలి

మిర్యాలగూడటౌన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): సేవాభావం అలవరుచుకోవాలని రూరల్ సీఐ నాగదుర్గాప్రసాద్ అన్నారు. పట్టణానికి చెందిన విద్యావేత్త పుప్పాల సత్యం తల్లి నర్సమ్మ వర్ధంతి సందర్భంగా లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఏరియా ఆస్పత్రిలో అల్పాహారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ దాతలను ప్రోత్సహిస్తూ, రోగులు, వారి సహాయకుల ఆకలి తీరుస్తున్న క్లబ్‌సేవలు ఆదర్శనీయమన్నారు. ఈ కార్యక్రమంలో సోషల్ వర్కర్ పుప్పాల యాదగిరి, కోల సైదులు, క్యామ వెంకటేశం, భాగ్యలక్ష్మి, మురహరి, నాయుడు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన సౌకర్యాల కల్పనకు కృషి

హాలియా, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు మెరుగైన సౌకర్యాల కల్పనకు ప్రభుత్వం కృషి చేస్తుందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కుందూరు వెంకట్‌రెడ్డి అన్నారు. మండలంలోని పేరూరు బ్రిడ్జి నిర్మాణ పనులకు శుక్రవారం ఆయన శంకుస్థాపన చేసి మాట్లాడారు. ప్రభుత్వం ఒక వైపు సంక్షేమం, మరో వైపు గ్రామాల అభివృద్ధికి విశేషంగా కృషి చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి కాకునూరి నారాయణగౌడ్, తహసీల్దార్ రఘు, యూత్ కాంగ్రెస్ జిల్లా మాజీ అధ్యక్షుడు గౌని రాజారమేష్ యాదవ్, ఇరిగేషన్ ఏఈ వర్క్ ఇన్‌స్పెక్టర్ కుందూరు రాజేందర్‌రెడ్డి, నాయకులు మొయినుద్దీన్, నవీన్, రవి, కృష్ణ, ఆంజనేయులు పాల్గొన్నారు.

విద్యార్థులు సైన్స్‌పై ఆసక్తి పెంచుకోవాలి



మిర్యాలగూడలో విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఎంఈవో

మిర్యాలగూడటౌన్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు సైన్స్‌పై ఆసక్తి పెంచుకోవాలని ఎంఈవో లావూరి బాలు అన్నారు. జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన నియోజకవర్గస్థాయి టాలెంట్ పరీక్షలో ఉత్తమ ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయికి ఎంపికైన విద్యార్థులను శుక్రవారం ఆయన అభినందించారు. ఈ సందర్భంగా బాలు మాట్లాడుతూ సైన్స్‌తోనే మానవ మనుగడ సాధ్యమని, సృష్టిలోని ప్రతి అంశం సామాన్యశాస్త్రంతో ముడిపడి ఉంటుందన్నారు. మూఢ నమ్మకాలు పారద్రోలుతూ విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న జేవీవీ సేవలు గొప్పవన్నారు. అనంతరం జిల్లాస్థాయికి ఎంపికైన విద్యార్థులు బ్రహ్మయ్య, నాగార్జున, విష్ణులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వేదిక జిల్లా అధ్యక్షుడు గుత్తికొండ సుదర్శన్‌రెడ్డి, రమణారెడ్డి, కృష్ణమూర్తి, కృష్ణానాయక్, వెంకటేశ్వర్లు, కోటయ్య పాల్గొన్నారు.

హాలియా: అనుముల మండల స్థాయి చెకుముకి సైన్స్ సంబరాలు 2025 పోటీల్లో హాలియాలోని వీఎస్ఆర్ పాఠశాల విద్యార్థులు ప్రథమ బహుమతి సాధించారు. ఈ పోటీల్లో బి.లోహిత్‌రెడ్డి(8వ), కె.సింధు (9వ), పి.వరుణ్‌సందేశ్ (10వ తరగతి) విద్యార్థి పాల్గొని ఉత్తమ ప్రతిభను కనబరిచి ప్రథమ బహుమతులను సాధించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ శివర్ల వెంకటేశ్వర్లు అభినందించారు.

గుర్రంపోడు: మండలకేంద్రంలోని జడ్పీ హైస్కూల్‌లో చెకుముకి టాలెంట్ టెస్టు ప్రశ్నపత్రాలను ఎంఈవో నోముల యాదగిరి ఆవిష్కరించారు. పలు పాఠశాలల విద్యార్థులు పోటీల్లో పాల్గొనగా మోడల్ స్కూల్, కొప్పోలు, తేనేపల్లి జడ్పీ హైస్కూల్, ప్రభుత్వ మోడల్‌స్కూల్ విద్యార్థులు జిల్లాస్థాయికి ఎంపికయ్యారు. ఈ నెల 28న నల్లగొండలో జరిగే జిల్లాస్థాయి చెకుముకి టాలెంట్ టెస్టు పోటీల్లో ఈ పాఠశాలల విద్యార్థులు పాల్గొంటారు. ఈ కార్యక్రమంలో గుర్రంపోడు, పాల్వాయి కాంప్లెక్స్ హెచ్‌ఎంలలు సంధ్యారాణి, విజయలక్ష్మి, ఉపాధ్యాయ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

వేములపల్లి: విద్యార్థి దశ నుంచే ప్రతీ ఒక్కరూ శాస్త్రీయ దృక్పథాన్ని అలవరుచుకోవాలని ఎంఈవో లక్ష్మణ్‌నాయక్ అన్నారు. శుక్రవారం జేవీవీ ఆధ్వర్యంలో విద్యార్థులకు నిర్వహించిన టాలెంట్ టెస్ట్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో షైనం కృష్ణయ్య, ఉపాధ్యాయులు శాంతాకుమారి, అనిల్, జ్యోతి, పద్మ, విద్యార్థులు పాల్గొన్నారు.

త్రిపురారం: ప్రశ్న ప్రగతికి మూలమని, చెక్‌ముకి టాలెంట్ టెస్టులు విద్యార్థులకు దోహదపడతాయని ఎంఈవో రవినాయక్ అన్నారు. మండలకేంద్రంలోని లిటిల్ ఫ్లవర్ హైస్కూల్‌లో జేవీవీ జిల్లా ఉపాధ్యక్షుడు కట్ల మధుసూదన్ ఆధ్వర్యంలో మండల స్థాయి టాలెంట్ టెస్టు పోటీలు నిర్వహించారు. ఈ టాలెంట్ టెస్టులో ప్రైవేట్ పాఠశాల విభాగంలో లిటిల్ ఫ్లవర్ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ పాఠశాల విభాగంలో పెద్దదేవులపల్లి, తెలుగు మీడియం విభాగంలో నీలాయిగూడెం, రెసిడెన్షియల్ పాఠశాల విభాగంలో మోడల్ స్కూల్ విద్యార్థులు ప్రథమస్థానంలో నిలిచారని అన్నారు. లిటిల్ ఫ్లవర్ ఉన్నత పాఠశాల ప్రిన్సిపాల్ కందిమల్ల దామోదర్, హెచ్‌ఎం కందుకూరి బాబు, ఉపాధ్యాయులు మడుపు శ్రీనివాస్, కిరణ్‌కుమార్, సైదా పాల్గొన్నారు.

చింతపల్లి: విద్యార్థులందరూ సైన్స్‌పై తమ జ్ఞానాన్ని పెంపుదించుకోవాలని ఎంఈవో అంజయ్య తెలిపారు. చింతపల్లి మండలకేంద్రంలోని జడ్పీహెచ్‌ఎస్‌లో జేవీవీ ఆధ్వర్యంలో చెకుముకి సైన్స్ మాసపత్రిక సౌజన్యంతో మండల స్థాయి సైన్స్ సంబురాలు నిర్వహించారు. చింతపల్లి మోడల్ స్కూల్‌తో పాటు, వీటీనగర్, జడ్పీహెచ్‌ఎస్‌కు చెందిన విద్యార్థులు పరీక్షలో పాల్గొని తమ ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయికి ఎంపికయ్యారు. చరిత, అనన్య, హర్షిత, తేజశ్రీ, సౌజుద్దీన్, పరమేష్ జిల్లా స్థాయికి ఎంపికయ్యారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్‌ఎం ఏడుకొండల్, సైన్స్ టీచర్లు జె.కృష్ణారెడ్డి, అనంతరెడ్డి, జి.దేవకుమార్, వి.శ్రీనివాస్, సులేమాన్, చంద్రయ్య, రాంరెడ్డి పాల్గొన్నారు.



గుర్రంపోడు: టెస్టు ప్రశ్నపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎంఈవో యాదగిరి

డాక్యుమెంట్ల డిజిటలైజేషన్ అసంపూర్ణం

(5వ పేజీ తరువాయి)

అది అసంపూర్తిగా మిగిలింది. గత ప్రభుత్వ ఆదేశాల మేరకు డాక్యుమెంట్లను రిజిస్ట్రేషన్ చేసినా, 60 నుంచి 70 శాతానికి మించలేదు. మరో 30శాతం డాక్యుమెంట్లను నిర్లక్ష్యంగా వదిలేశారు. ఆయా డాక్యుమెంట్లకు సంబంధించిన ప్రతీ కాగితాన్ని డిజిటలైజేషన్ చేయాల్సి ఉండగా, కొన్ని చిరిగిపోవడం, కొన్నింటిలో అక్షరాలు కనపడకపోవడంతో వాటిని పక్కన పెట్టినట్టు తెలిసింది. అంతేగాక డిజిటలైజేషన్ ప్రక్రియకు సంబంధించి బిల్లులు సకాలంలో చెల్లించకపోవడంతో ఈ ప్రక్రియ మధ్యలోనే నిలిచినట్టు తెలిసింది. ప్రధానంగా ఉర్దూ డాక్యుమెంట్ల డిజిటలైజేషన్ సమయంలో ఆ భాషా అర్థం చేసుకోవడంకోసం, ఎంతో అనుభవం ఉన్న వ్యక్తులను అందుబాటులో ఉంచుకొని ఈ ప్రక్రియ చేపట్టాల్సి ఉండగా, మొక్కుబడిగా చేపట్టినట్లు తెలిసింది. అదేవిధంగా డిజిటలైజేషన్ చేపట్టామని అధికారులు చెబుతున్నా, వాటికి సంబంధించిన నకలు కాపీల నిమిత్తం ఎవరైనా దరఖాస్తు చేస్తే ఆన్‌లైన్‌లో లేకపోవడంతో సమస్య ఎదురవుతోంది. పాత డాక్యుమెంట్లకు సంబంధించిన ఈసీలు, సీసీలు, ఇతర వివరాలు ఆన్‌లైన్‌లో లభించడం లేదు. ఉర్దూ, ఇంగ్లీష్‌లో ఉన్న డాక్యుమెంట్లు పాతబడి చదవలేని స్థాయిలో ఉన్నప్పుడు వాటిని జాగ్రత్తగా జీరాక్స్ తీయడంతో పాటు ఆధునిక యంత్రాల ద్వారా పాత డాక్యుమెంట్ వివరాలు ఉండేలా చూసి డిజిటలైజేషన్ చేస్తేనే ఆరు దశాబ్దాల కాలం నాటి ఈ దస్తావేజులు అందుబాటులో వస్తాయి. వాస్తవానికి ప్రతీ ఆస్తి కొనుగోలు అనంతరం రిజిస్ట్రేషన్ పూర్తయ్యాక ప్రస్తుతం వెంటనే ఆన్‌లైన్‌లో పొందుపరుస్తున్నారు. అయితే ఆరు దశాబ్దాల కాలం నాటి డాక్యుమెంట్లకు మాత్రం సరైన భద్రత కరువైంది. ఇప్పటికైనా పూర్తిస్థాయిలో స్టాంపులు, రిజిస్ట్రేషన్‌శాఖ అధికారులు డాక్యుమెంట్లను భద్రపరచాలని ఆస్తుల క్రయ, విక్రయదారులు కోరుతున్నారు.

ఆంధ్రజ్యోతి సదా మీ సేవలో..
'ఆంధ్రజ్యోతి'కి చందాదారులుగా చేరాలనుకుంటున్నారా! పత్రిక పంపిణీలో ఏమైనా అసౌకర్యం ఎదురైందా! మాకు సమాచారమివ్వండి.. మా సిబ్బంది సదా మీ సేవకు సిద్ధంగా ఉంటారు. సంప్రదించగలరు : మిర్యాలగూడ, దేవరకొండ, హాలియా
ACM - 9985411394 Miryalguda ACO - 9963624250, Miryalguda SR - 9542690885, Devarkonda SR - 9392062350, Haliya SR - 9885226544